ఈనాటి
# తెలుగోడు
PRGI-NO-APTEL/25/A2739

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com



Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుండి 8.30 వరకు
సా.4 గం.నుండి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుండి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు



సంపుటి-1 | సంచిక - 112 | బుధవారం 21 జనవరి 2026 | పేజీలు - 10 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati


## విశాఖపట్నం, కాకినాడ పోర్టుల్లో
# హైడ్రోజన్ టెర్మినల్




### ఎవల్యూషన్ సినర్జిటిక్ సంస్థతో లోకేశ్ చర్చలు

**అమరావతి (తెలుగోడు), జనవరి 20 :**

విశాఖపట్నం, కాకినాడ పోర్టుల్లో హైడ్రోజన్ టెర్మినల్ (ట్రాక్టర్స్ పైలట్ వాహనాలను తయారు చేసి వినియోగించాలని కాంప్లెక్ట్ వెహికల్స్, మొబిలిటీ సిస్టమ్స్ అభివృద్ధిలో ప్రత్యేకత కలిగిన ఏఓ సంస్థను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. స్పెయిన్‌కు చెందిన ఎవల్యూషన్ సినర్జిటిక్ ఆటోమోటివ్ ఎస్ఎల్ సంస్థ ఎండీ జోస్ మెల్లాడోతో మంత్రి నారా లోకేశ్ దావోస్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఏపీ ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్, జీరో-ఎమిషన్ వెహికల్స్ (జడ్ఈవీ) రంగాల్లో అంతర్జాతీయ స్థాయి భాగస్వాములను బలోపేతం చేసేందుకు ఆసక్తిగా ఉందన్నారు. రాష్ట్రంలోని పారిశ్రామిక పార్కులు, పోర్టులు, ఇంజినీరింగ్ శాండ్ బాక్స్‌లను అందిస్తూ ఏపీ గ్రీన్ ఎనర్జీ లక్ష్యాలను సాకారం చేయబోతోందన్నారు. ఏపీ పారిశ్రామిక పార్కుల్లో ఎలక్ట్రిక్/హైడ్రోజన్ ఆఫ్ రోడ్ వాహనాల కోసం కో-పైలట్‌ను అభివృద్ధి చేసి, రీడిజైన్, ఆప్టిమైజేషన్‌కు నేతృత్వం వహించండి. ఇందుకు అవసరమైన టెస్ట్ బెడ్‌లు, అనుమతులను ఏపీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఏపీ ప్రారంభ దశ ఆవిష్కరణలను ప్రోత్సహించాలని భావిస్తోందన్నారు. ప్రొటో టైప్ అభివృద్ధికి, ఇంజినీర్ల శిక్షణకు ఏపీ ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఇండస్ట్రియల్ లేదా అడమిక్ క్యాంపస్‌లో చిన్న ఇంజినీరింగ్ శాండ్ బాక్స్‌లను అందిస్తుందని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు తాము ఈ పెట్టుబడిదారుల సమీక్షకు హాజరై శ్రమిస్తున్నామని మంత్రి లోకేష్ వివరించారు.




## ఏపికి రండీ..! అందరం కలసి
# భవిష్యత్తును నిర్మిద్దాం

- పెట్టుబడులే లక్ష్యంగా చంద్రబాబు కృషి
- పలు సంస్థల ప్రతినిధులతో వరుస భేటీలు
- క్యాంటం కంప్యూటింగ్ సెంటర్ పై ఐబీఎం సీఈవోతో చర్చ
- మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు
- యూఏఈ ఆర్థిక మంత్రి అల్ మార్రీతో భేటీ
- 40 సంస్థలు ఏపీలో ఏర్పాటుకు అల్ మార్రీ హామీ

**అమరావతి (తెలుగోడు), జనవరి 20 :**

పెట్టుబడుదారులు ఏపికి రావాలని, అందరం కలసి మంచి భవిష్యత్తును నిర్మిద్దామని స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. దావోస్ పర్యటనలో చంద్రబాబు పలు కీలక భేటీల్లో పాల్గొన్నారు. దావోస్‌లో చంద్రబాబు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచారు. గతంలో తనతో ఉన్న ఉన్న పరిచయాలతో ఆయన పలు కంపెనీల ప్రతినిధులతో వెంటవెంటనే చర్చలు మొదలు పెట్టారు. పెట్టుబడులే లక్ష్యంగా వివిధ సంస్థల అధినేతలతో వరుస భేటీలు అయ్యారు. ఐబీఎం ఛైర్మన్, సీఈవో అర్వింద్ కృష్ణ.. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌తో భేటీ అయ్యారు. అమరావతిలో క్యాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటుపై ఐబీఎం సీఈవోతో చర్చించారు. క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ నెలకొల్పాలని చంద్రబాబు ఆయనను కోరారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలకు ఐబీఎం సీఈవో సానుకూలం గా స్పందించారు. కృత్రిమ మేధ (ఏఐ)లో మిగతా 2లో



## రాష్ట్రంలో పెట్టుబడులన్నీ
# బూటకం



- పెట్టుబడుల పేరుతో తండ్రీకొడుకుల ప్రచారం వట్టి బూటకం..
- వేల కోట్ల భూములు బినామీలకు దోచిపెట్టి దోపిడీ...
- దావోస్ పర్యటనల్నీ భోగస్సే..
- వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి...

**తాడేపల్లి (తెలుగోడు), జనవరి 20 :**

పెట్టుబడుల పేరుతో తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేష్ చేసుకుంటున్న ప్రచారమంతా వట్టి బూటకమేనని, కంపెనీల ఏర్పాటు పేరుతో వేల కోట్ల విలువైన భూములు బినామీలకు దోచిపెట్టి ప్రభుత్వ సంపదను దోపిడీ చేస్తున్నది మాత్రమే నిజమని వైఎస్సార్సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ కుమార్రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఏటా పెట్టుబడుల పేరుతో చంద్రబాబు చేస్తున్న దావోస్ పర్యటనలన్నీ బోగస్ అని, లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయన చెప్పడమే తప్ప వాటిలో కార్యరూపం దాల్చిన వాటి వివరాలు చెప్పే ధైర్యం కూటమి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. తమను తాము (మిగతా 2లో)

## నవీన్ నా బాస్
# నేను ఓ కార్యకర్తను
## ప్రధాని మోడీ



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 20 :**

బీజేపీ నూతన జాతీయాధ్యక్షుడిగా బీహార్?కు చెందిన నితీన్ నవీన్ మంగళవారం(జనవరి 20) బాధ్యతలు స్వీకరించారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలో ప్రధాన నరేంద్ర మోదీ నూతన అధ్యక్షుడిని కొనియాడుతూ చేసిన కామెంట్స్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. బిజెపి చరిత్రలోనే అత్యంత పిన్న (మిగతా 2లో)

## త్వరలో పీఎం కిసాన్‌తో పాటు
# అన్నదాతా సుఖీభవ

- ఒకేసారి రెండు పథకాల నిధులు రైతుల ఖాతల్లోకి ..
- ఫిబ్రవరి 14న ఇచ్చే అవకాశం..
- అదే సమయంలో రాష్ట్రం అన్నదాత సుఖీభవ..



**అమరావతి (తెలుగోడు), జనవరి 20 :**

రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నలకు అందజేసే పీఎం కిసాన్ తో పాటుగా రాష్ట్ర రైతన్నలకు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల పైన కీలక సమాచారం అందుతోంది. మరో సారి రెండు పథకాల నిధులు రైతుల ఖాతాల్లో ఒకే సమయంలో జమ కానున్నాయి. 22వ విడత పీఎం కిసాన్ నిధుల పైన కేంద్ర అధికారులు క్లారిటీ ఇచ్చారు. సంక్రాంతి సమయంలో రైతులకు ఈ నిధులు విడుదల చేస్తారని భావించారు. అయితే, ఇప్పుడు ఈ ముహూర్తం పైన స్పష్టత వచ్చింది. అదే సమయంలో ఏపీ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేయనుంది. కేంద్ర బడ్జెట్ వేళ రైతులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం ప్రతీ ఏటా మూడు విడతలుగా అందిస్తున్న పీఎం కిసాన్ 22వ విడత నిధుల విడుదల పైన ఒక నిర్ణయానికి వచ్చింది. నవంబర్ 19న 21వ విడత నిధులను ప్రధాని విడుదల చేసారు. కాగా.. ఏపీ ప్రభుత్వం ఇదే సమయంలో పీఎం కిసాన్ తో కలిపి అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేస్తోంది. ఈ రెండు (మిగతా 2లో)

# జయా..ఎలా వున్నావ్

- ట్రాఫిక్ క్లీయర్‌లో ప్రత్యేక శ్రద్ధ..
- కానిస్టేబుల్ జయశాంతికి హోంమంత్రి అభినందన..
- ఫోన్ చేసి యోగక్షేమాలపై ఆరా..
- జయశాంతి లాంటి పోలీసుల వల్ల ప్రజలకు మరింత నమ్మకం..



**అమరావతి (తెలుగోడు), జనవరి 20 :**

మహిళా కానిస్టేబుల్ జయశాంతికి ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత అభినందనలు తెలిపారు. కాకినాడలోని కెనాల్ రోడ్డులో గత శనివారం భారీ ట్రాఫిక్ జామ్ అవ్వగా.. దానిని కానిస్టేబుల్ జయశాంతి క్లియర్ చేశారు. ఈ వ్యవహారంపై హోంమంత్రి అనిత స్పందిస్తూ.. ఆమెకు ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. జయశాంతి లాంటి పోలీసుల వల్ల ప్రజలకు మరింత నమ్మకం పెరిగిందని మంత్రి అనిత తెలిపారు. జయశాంతి కుటుంబం యోగక్షేమాలను కూడా అడిగి తెలుసుకున్నారు అనిత. ఈ క్రమంలో తాను హోంమంత్రిని కలుస్తానని జయశాంతి చెప్పారు. త్వరలోనే కలుద్దామని హోం మంత్రి చెప్పారు. ఈ సంఘటన మహిళా పోలీసుల సాహసాన్ని, విధి నిర్వహణలో వారి పాత్రను ప్రదర్శించే ఒక మంచి ఉదాహరణగా నిలిచిందని పలువురు పేర్కొన్నారు. కాకినాడలోని కెనాల్ రోడ్డులో శనివారం (మిగతా 2లో)

# జోగీ బ్రదర్స్‌కి బెయిల్
## అయినా ఇద్దరూ జైల్లోనే



**విజయవాడ (తెలుగోడు), జనవరి 20 :**

ఏపీ కల్తీ మద్యం తయారీ కేసులో మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత జోగి రమేశ్, ఆయన సోదరుడు జోగి రాముకు విజయవాడ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. 6వ ఏంఓఈఅ కోర్టు భవానీపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో వీరిద్దరికి బెయిల్ మంజూరు చేసింది. జోగి రమేశ్, జోగి రాము.. భవానీపురంలో నకిలీ మద్యం తయారీ కేసులో నిందితులుగా ఉన్నారు. వీరిద్దరూ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. ఈ కేసులో ఏ18గా జోగి రమేశ్, ఏ19గా జోగి రాము పేర్లు ఉన్నాయి. అయితే.. ములకల చెరువు కేసులో ఇంకా జోగి రమేశ్‌కు బెయిల్ రాలేదు. దీంతో జైల్లోనే జోగి సోదరులు ఇంకా జైల్లోనే ఉండనున్నారు. అంతకుముందు.. (మిగతా 2లో)

## ధాన్యం కొన్న వెంటనే
# డబ్బులు



**విజయవాడ (తెలుగోడు), జనవరి 20 :**

ఇకపై ఉదయం ధాన్యం కొంటే.. అదే రోజు సాయంత్రానికి నగదు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. రబీ ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని.. రైతు సేవా కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించేలా శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 6,83,623 మంది రైతుల నుంచి రూ.9,890 కోట్ల విలువైన 41.69 (మిగతా 2లో)

# హరిత ఆంధ్ర సాధనే లక్ష్యం

- రాష్ట్రంలో 50శాతం పచ్చదనం..
- రాష్ట్ర భూ భాగంలో 2047 నాటికి 50 శాతం గ్రీనరీ..
- ఉగాది నుంచి గ్రీన్ కవర్ యాక్షన్ ప్లాన్ అమలు..
- గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి వృక్షాలకు ప్రాధాన్యం..
- తీర ప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్ప నీటిని తట్టుకునే మొక్కల పెంపకం
- నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు సన్నద్ధం కావాలి
- అటవీశాఖతో పాటు వివిధ శాఖల అధిపతులతో పవన్ కళ్యాణ్ సమీక్ష



**అమరావతి (తెలుగోడు), జనవరి 20 :**

హరిత ఆంధ్ర లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్రాన్ని 50 శాతం పచ్చదనంతో నింపే గ్రీన్ కవర్ ప్రాజెక్టులో అన్ని శాఖలు త్రికరణ శుద్ధిగా భాగస్వామ్యం తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు ఉగాదిలోపు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఉగాది నుంచి గ్రీన్ కవర్ యాక్షన్ ప్లాన్ అమలు కావాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ.. కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటేందుకు, తీర ప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పు నీటిని తట్టుకునే మొక్కల పెంపకానికి సిద్ధం కావాలని నిర్దేశం చేశారు. గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి వృక్ష జాతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత వర్గాలకు సూచనలు చేశారు. మంగళవారం వెళగపూడి లోని రాష్ట్ర సచివాలయంలో అటవీశాఖతో పాటు వివిధ శాఖల అధిపతులు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 50 శాతం గ్రీన్ కవర్ ప్రాజెక్టుపై చర్చించారు. ప్రాజెక్టు ప్రణాళికలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా (మిగతా 2లో)

## టిడిపి అంటే
# తెలుగుదేశం డర్టీ పార్టీ




**విశాఖపట్నం (తెలుగోడు), జనవరి 20 :**

సాక్షి, విశాఖపట్నం: టీడీపీ అంటే తెలుగుదేశం డర్టీ పాలన అని రుజువైంది అంటూ మండిపడ్డారు వైఎస్సార్సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి. మహిళలు సిగ్గుతో తలదించుకునే విధంగా సంక్రాంతికి సంబరాలు జరిగాయని ఆరోపించారు. అసాంఘిక కార్యకలాపాలకు పోలీసులను కాపలాగా పెట్టారని కూటమి సర్కార్పై నిప్పులు చెరిగారు. వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విశాఖలో మీడియాతో మాట్లాడుతూ. (మిగతా 2లో)

# కలసి భవిష్యత్తును నిర్మిద్దాం



(మొదటి పేజి (తరువాయి)

భారత్‌లోని 50 లక్షల మంది యువతకు శిక్షణ ఇవ్వాలని ఐబీఎం నిర్ణయించింది. ఏపీలో 10 లక్షల మందికి శిక్షణ ఇవ్వాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. అనంతరం సీఎం చంద్రబాబుతో గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ భేటీ అయ్యారు. విశాఖలో గూగుల్ ఏఐ డేటా సెంటర్ నిర్మాణంపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. జాప్యం లేకుండా డేటా సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలని సీఎం కోరారు. ఇకపోతే యూఏఈ ఆర్థిక మంత్రి అల్ మార్రీతో భేటీ అయ్యారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు, ఏపీ-యూఏఈ మధ్య ఆర్థిక భాగస్వామ్య బలోపేతంపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్‌లో యూఏఈతో కలిసి పనిచేసేందుకు అంగీకారం కుదిరింది. యూఏఈకి చెందిన 40 సంస్థలు ఏపీలో ఏర్పాటుకు తోడ్పాటు అందిస్తామని అల్ మార్రీ పేర్కొన్నారు. ఆహార భద్రత, లాజిస్టిక్స్, పోర్ట్ ఆధారిత పరిశ్రమల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చ జరిగింది. పునరుత్పాదక శక్తి, పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై ఇరువురు చర్చించారు. ఇకపోతే వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో పారిశ్రామికవేత్తలతో భారత పరిశ్రమల సమాఖ్య బ్రేక్ ఫాస్ట్ సెషన్ నిర్వహించింది. ఈ సెషన్‌కు ఏపీ సీఎం చంద్రబాబు, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, మాస్టర్ కార్డ్ సీఏవో, కాగ్నిజెంట్ సీఈవో రవికుమార్ సహా పలు విదేశీ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. భారత్ కేంద్రంగా అభివృద్ధి-ఏపీ సానుకూలతలపై సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఇంధనం, డిజిటల్ ఇన్‌ఫ్రాలో పెట్టుబడులపై నెలకొన్న అవకాశాలపై చర్చ చేపట్టారు. లాజిస్టిక్స్, తయారీ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులకు సంబంధించి అవకాశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు, గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు, విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో సాధించిన పెట్టుబడులను సీఎం వివరించారు. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను పారిశ్రామికవేత్తలకు తెలిపారు. స్పేస్ సిటీ, పోర్టులు, ఎయిర్ పోర్టులు, హైవే కనెక్టివిటీ అంశాలపై దృష్టిపెట్టామని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీ ఆకర్షించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తల దగ్గరకు స్వయంగా వెళ్లిన సీఎం చంద్రబాబు.. వారిని ఆత్మీయంగా పలకరించారు.

# నవీన్ నా బాస్... ప్రధాని మోడీ



(మొదటి పేజి (తరువాయి)

వయస్కుడైన (45 ఏళ్లు) అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నవీన్?ను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ క్రమశిక్షణను, నూతన నాయకత్వంపై తనకున్న నమ్మకాన్ని చాటుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నితిన్ నవీన్ నా బాస్: ప్రధాని మోదీ "పార్టీ విషయానికి వస్తే నితిన్ నవీన్ నా బాస్, నేను కేవలం ఒక పార్టీ కార్యకర్తను మాత్రమే" అని ప్రధాని ప్రకటించారు. ఇది పార్టీలో పదవి కంటే సంస్థాగత గౌరవమే ముఖ్యమని చాటిచెప్పింది. నితిన్ నవీన్?ను మోదీ ఒక 'మిల్లేనియల్' నాయకుడిగా అభివర్ణించారు. రేడియో ద్వారా సమాచారం విన్న తరం నుంచి నేడు కృత్రిమ మేధస్సు (ూ×)ను వినియోగిస్తున్న తరం వరకు జరిగిన సామాజిక, సాంకేతిక మార్పులను ఆయన ప్రత్యక్షంగా చూశారని కొనియాడారు. యువ ఉత్సాహంతో పాటు సుదీర్ఘ సంస్థాగత అనుభవం ఉన్న నితిన్ నవీన్ నాయకత్వం పార్టీ కార్యకర్తలందరికీ గొప్ప మేలు చేస్తుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే నవీన్ కిషోర్ ప్రసాద్ సిన్హా కుమారుడైన నితిన్.. బీహార్?లోని బాంకీపూర్ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతంలో బీహార్ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం, గృహనిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. జేపీ నడ్డా వారసుడిగా నితిన్ నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనవరి 19న ఆయన నామినేషన్?పై ప్రధాని మోదీ స్వయంగా సంతకం చేయడం విశేషం.

# రాష్ట్రంలో పెట్టుబడులన్నీ బూటకం



(మొదటి పేజి (తరువాయి)

పొగుడుకోవడానికో, వైఎస్ జగన్ని తిట్టడానికే దావోస్ వెళ్లడం దేనికని సతీష్ రెడ్డి మండిపడ్డారు.
పక్క రాష్ట్రం తెలంగాణలో భూములను వేలం వేసి మరీ కంపెనీలకు అప్పజెబుతుంటే, చంద్రబాబు మాత్రం ఎకరం 99 పైసలకే కట్టబెట్టడం దోపిడీకాక ఇంకేమిటని ప్రశ్నించారు. దీనిపై జర్నలిస్టులు ప్రశ్నిస్తే.. మా ఇష్టం నేనిస్తా అని చెబుతున్న నారా లోకేష్కి అధికార మదం తలకెక్కిందని మండిపడ్డారు. అంతగా ఇవ్వాలనుకుంటే హెరిటేజ్ ఆస్తులు ఇచ్చుకోవాలని సూచించారు. ఇలాంటి నిరంకుశ నియంత పోకడలతోనే ఫ్రెంచి విప్లవం పుట్టిందనే విషయాన్ని చంద్రబాబు తెలుసుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వ విధానాలపై తెలుగుదేశం అనుకూల మీడియాలోనే తీవ్రమైన వ్యతిరేక కథనాలు వస్తున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో విచిత్ర వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రిగా పెట్టుబడుల పేరుతో దావోస్ పర్యటనలు చేసే తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేష్ పబ్లిసిటీ పిచ్చికి వందల కోట్ల ప్రజాధనం వృథా అవుతోంది. పెద్ద మొత్తంలో ప్రజాధనం ఖర్చు చేసి తమను తామే పొగుడుకోవడం, వైఎస్ జగన్ని తిట్టడం తప్ప, రాష్ట్రానికి తెచ్చిన పెట్టుబడులు మాత్రం శూన్యం. 2014-19 మధ్య జరిగిందే ఇప్పుడూ జరుగుతోంది. లక్షల కోట్ల ఒప్పందాలు చేసుకున్నామని ఎల్లో మీడియాలో ఇబ్బడిముబ్బడిగా రాయిస్తారే కానీ, వాటిలో కార్యరూపం దాల్చిన వాటి వివరాలు మాత్రం ఎప్పటికీ చెప్పరు.
కానీ వైఎస్సార్సీపీ హయాంలో వైఎస్ జగన్ కృషితో ఏర్పాటైన పరిశ్రమలకు శంకుస్థాపనలు, భూమి పూజలు చేసి తామే సాధించినట్టుగా క్రెడిట్ చోరీకి పాల్పడుతుంటారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు నిత్యం వైఎస్ జగన్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. సీఎంగా చంద్రబాబు రూ.23 లక్షల కోట్ల ఎంవోయూలు చేసుకుంటే వాటిలో కార్యరూపం దాల్చినవి 5 శాతం కూడా లేవు. పారిశ్రామిక అభివృద్ధి, కంపెనీల ఏర్పాటు పేరుతో ఊరూపేరులోని కంపెనీలకు విశాఖలో వేల కోట్ల విలువైన భూములు ఎకరం 99 పైసలకు కట్టబెడుతున్నారు.
తెలంగాణలో ప్రభుత్వ స్థలం ఓపెన్గా వేలం వేసి ఎకరం రూ.170 కోట్లకు విక్రయిస్తుంటే, చంద్రబాబు మాత్రం పెట్టుబడుల పేరుతో తన బినామీలకు అప్పనంగా కట్టబెట్టేస్తున్నాడు. భూ పంపిణీ రూపంలో ఏడాదిన్నరలోనే చంద్రబాబు వేల కోట్ల అవినీతికి పాల్పడ్డాడు. అప్పనంగా భూములు కట్టబెట్టడంపై జర్నలిస్టులు నారా లోకేష్ని ప్రశ్నిస్తే.. విమర్శలకు సమాధానం చెప్పకుండా నా ఇష్టం, నేనిస్తా అంటున్న నారా లోకేష్ అహంకారాన్ని ప్రజలే దించుతారని సతీష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# హరిత ఆంధ్ర సాధనే లక్ష్యం



(మొదటి పేజి (తరువాయి)

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంపు ప్రాజెక్టుకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.. రాష్ట్రం మొత్తం భూ భాగంలో 2047 నాటికి 50 శాతం పచ్చదనంతో నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం 32.60 లక్షల ఎకరాల్లో మొక్కలు నాటాల్సి ఉంది. ఈ లక్ష్యంలో భాగంగా 2030 నాటికి 37 శాతం పచ్చదనం నింపాల్సి ఉందన్నారు.. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో 30 శాతం గ్రీనరి ఉండగా.., వచ్చే నాలుగేళ్లలో మరో 7 శాతం గ్రీనరీ పెంచాల్సి ఉంది. అందుకోసం 9 లక్షల హెక్టార్లలో చెట్లను నాటాలని పిలుపునిచ్చారు.. ఈ యజ్ఞంలో అన్ని శాఖలు తమ వంతు భాగస్వామ్యం పోషించాల్సి ఉంది. అందులో ఉద్యానవన శాఖ 12 శాతం మొక్కలు నాటే బాధ్యతను స్వీకరించాల్సి ఉంది.. ప్రతి మొక్కా పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడాలి.. వీటితోపాటు అటవీ, పర్యావరణ శాఖలు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలు, నీటిపారుదల శాఖ, పాఠశాల విద్యాశాఖ, రోడ్లు భవనాల శాఖ, పరిశ్రమల శాఖ, వ్యవసాయ శాఖ, కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న రైల్వే తదితర శాఖలు తమ తమ పరిధిలో లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్లాల్సి ఉందన్నారు జాతీయ రహదారులకి ఇరువైపులా మొక్కలు నాటే సంప్రదాయం ఉంది.. దీన్ని రాష్ట్ర పరిధిలోని రహదారుల నిర్మాణంలోనూ అమలు చేయాలి అన్నారు పవన్.. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టు కూడా గ్రీన్ కవర్ పెంపునకు దోహదపడుతుంది.. 970 ఎకరాల తీర ప్రాంతం వెంబడి 40 శాతం అటవీ శాఖ పరిధిలో ఉండగా, మిగిలిన భూభాగంలో ప్రాజెక్టుని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరం అయిన ప్రణాళికలు ఆయా శాఖలు సిద్ధం చేయాలి. తీర ప్రాంతం వెంబడి ఉన్న ప్రాంతంలో అక్కడ వాతావరణ పరిస్థితులకు తట్టుకునే మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పారిశ్రామిక కారిడార్లలో కాలుష్య నియంత్రణకు తోడ్పడే మొక్కలను పెంచాలి. రైతుల భూముల్లో వారికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించే పండ్ల రకాల మొక్కలు పెంచాలి. కాలువగట్లు, చెరువుల గట్ల వెంబడి కూడా పండ్ల మొక్కలు నాటాలి. మనం నాటే ప్రతి మొక్క పర్యావరణానికి, ప్రజలకు ఉపయోగపడే స్వజాతి మొక్కలు ఉండేలా చూసుకోవాలి. అందుకు సంబంధించి శాఖల వారీ యాక్షన్ ఎ÷-లాన్ అవసరం అన్నారు.. నిర్దేశిత సమయంలో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేయండి. బ్జడెట్ కేటాయింపులు ముఖ్యమంత్రి తో చర్చిస్తాం.. లక్ష్యాలకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేసే బాధ్యతను యంత్రాంగం నిబద్ధతతో ముందుకు తీసుకువెళ్లాలి.. అన్ని సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఫిబ్రవరి 5వ తేదీన జరిగే తదుపరి సమావేశానికి పూర్తి స్థాయి
ప్రణాళికలతో రావాలని అన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

# పోలవరంలో విదేశీ ప్రతినిధులు

## రెండోరోజు పలు ప్రాంతాల పరిశీలన


**ఏలూరు (తెలుగోడు), జనవరి 20 :** పోలవరం ప్రాజెక్ట్ లో విదేశీ నిపుణుల బృందం రెండో రోజు పర్యటన మంగళవారం కొనసాగింది. విదేశీ నిపుణులు సీన్ హించిబెగ్రర్ , డేవిడ్ బి పాల్ , జియాన్ ఫ్రాంకో డి సీకోలతో పాటు కేంద్ర జల వనరుల శాఖలోని వివిధ విభాగాల సీనియర్ అధికారులు ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. రెండో రోజు మధ్యాహ్నం వీరు మెయిన్ డాం గ్యాప్ 2 ఇసుక రీచ్, మెటీరియల్ లభ్యత మొదలైన వాటిని పరిశీలిస్తారు .అంతకు ముందు కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ ప్రతినిధులతో సమావేశమై తోలి రోజు ఫీల్డ్ లో తమ దృష్టికి వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వర రావు, ఈ ఎన్ సి కె నరసింహమూర్తి, పోలవరం ప్రాజెక్ట్ ఎస్ ఈ ఆర్ రామచంద్ర రావు, ఎం ఈ ఐ ఎల్ జనరల్ మేనేజర్ ఏ గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి, తదితరులు అంతర్జాతీయ నిపుణుల బృందంతో పాటు కేంద్ర జలవనరుల శాఖ అధికారులకు వివరాలు అందించారు. వారి వివరాలతోపాటు తాము ఫీల్డ్లో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించుకొని సందేహాలు తీర్చుకున్నారు. ఈ బృందంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి , మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, సిఎస్ అధికారులు మనీష్ గుప్తా , రవి అగర్వాల్ , సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి వి ఎస్ రామారావు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, డైరెక్టర్ కె శంకర్, ఎస్ ఐ ఆర్ ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతాని ఉన్నారు.

# టెన్త్ పరీక్షల షెడ్యూల్ విడుదల

## మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు

**అమరావతి (తెలుగోడు), జనవరి 20 :**

ఆంధ్రప్రదేశ్‌లో 10వ తరగతి పరీక్షల తుది షెడ్యూల్ విడుదల అయింది. గతంలో ఇచ్చిన టెంటేటివ్ షెడ్యూల్‌నే ౖ÷నైల్ షెడ్యూల్‌గా ఖరారు చేస్తూ పరీక్షా విభాగం మంగళవారం పాఠశాలలకు సమాచారం ఇచ్చింది. మార్చి 16 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఈ మేరకు ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్షల విభాగం డైరెక్టర్ ప్రకటన విడుదల చేశారు.పదవతరగతి పరీక్షల షెడ్యూల్ ఇలా ఉంది. మార్చి 16వ తేదీన ఫస్ట్ లాంగ్వేజ్.,మార్చి 18వ తేదీన సెకండ్ లాంగ్వేజ్.,మార్చి 20వ తేదీన ఇంగ్లీషు.,మార్చి 23వ గణితం.,మార్చి 25వ తేదీన



ఫిజికల్ సైన్స్.,మార్చి 28వ తేదీన బయోలాజికల్ సైన్స్. మార్చి 31వ తేదీన సోషల్ స్టడీస్ పరీక్ష నిర్వహిస్తారు.

# మేడారం జాతరకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

## మహిళలకు ఉచిత ప్రయాణం యధాతథం 51 కేంద్రాల నుంచి 4వేల బస్సులు

## రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి




**హైదరాబాద్ (తెలుగోడు), జనవరి 20 :** మేడారం జాతరకు రాష్ట్రంలోని 51 కేంద్రాల నుంచి 4వేల బస్సులు నడిపేలా ఏర్పాట్లు చేశామని తెలంగాణ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మేడారానికి వెళ్లే మహిళలకు సైతం ఉచిత ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. రవాణా శాఖ నుంచి 10, 441 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. మంగళవారం తెలంగాణ సచివాలయంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడారం జాతరకు ఆర్టీసీ సన్నద్ధతపై అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ వికాస్‌రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఆర్టీసీ ఈడీలు, ఆర్ఎంలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు . ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మేడారం విధుల్లో 7వేల మంది డ్రైవర్లు - 18 మంది కండక్టర్లు, 800 మంది సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. 28వ తేదీ నుంచి 1వ తేదీ వరకు స్పెషల్ బస్సులు నడుపుతామని చెప్పుకొచ్చారు. మేడారం వెళ్లేటప్పుడు బస్సులు నిండుతాయని... వచ్చేటప్పుడు ఖాళీగా బస్సులు వస్తాయని తెలిపారు. వన్ వేలో బస్సులు ఖాళీగా వెళ్తాయి కాబట్టి... రెగ్యులర్ ఛార్జీల కంటే 50శాతం అదనపు ఛార్జీలు వసూలు చేస్తారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో 20 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడారంలో 50ఎకరాల్లో వెయ్యి బస్సులు నిలిపేలా తాత్కాలిక బస్ షెల్టర్స్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. నిమిషానికి నాలుగు బస్సులు వెళ్లేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. బస్ షెల్టర్ల వద్ద 9 కిలోమీటర్ల మేర 50 క్యూ లైన్స్ ఏర్పాటు చేశామని అన్నారు. బస్టాండ్స్‌లో క్లోజ్డ్ సర్క్యూట్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. వీటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# అన్నదాతా సుఖీభవ

(మొదటి పేజి (తరువాయి)

పథకాల నిధులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ 14 వేలు ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. కాగా, 22వ విడత నిధులను తొలుత సంక్రాంతి సమయంలోనే విడుదల చేస్తారని భావించారు. అయితే, ఫిబ్రవరి బడ్జెట్ సమయంలోనే విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఫిబ్రవరి 1న బడ్జెట్ ఉండే అవకాశం ఉండటంతో.. 14వ తేదీన ఈ నిధులను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ పథకం ద్వారా దేశంలో 11 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటివరకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్లకు పైగా నిధులు అందించారు. కాగా, ఏపీలో కూటమి ప్రభుత్వం పీఎం కిసాన్ తో కలిపి తాము ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం అమలుకు నిర్ణయించింది. ఈ మేరకు తొలి విడతగా పీఎం కిసాన్ తో కలిపి రెండు విడతల్లో రూ 5 వేలు చొప్పున రూ 10 వేలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇక, ఇప్పుడు మూడో విడత నిధులను పీఎం కిసాన్ 22వ విడత తో కలిపి జమ చేయనుంది. మూడో విడతగా ఏపీ ప్రభుత్వం అర్హత పొందిన రైతు ఖాతాల్లో రూ 4 వేలు జమ చేయాల్సి ఉంటుంది.ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కేంద్రం ప్రతీ ఏటా మూడు విడతలుగా పీఎం కిసాన్ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఏపీ ప్రభుత్వం ప్రకటించిన రూ 20 వేలు అన్నదాత సుఖీభవ నిధుల్లో కేంద్రం ఇస్తున్న రూ 6 వేలు మినహాయించి.. మిగిలిన రూ 14 వేలు మూడు విడతలుగా పీఎం కిసాన్ తో పాటుగా అందించాలని నిర్ణయించింది. దీంతో... పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ నిధులు కలిసి ఫిబ్రవరి రైతుల ఖాతాల్లో ఒకే సారి రూ 6 వేలు జమ అయ్యే అవకాశం కనిపిస్తోంది.

# జయా.. ఎలా వున్నావ్..

(మొదటి పేజి (తరువాయి)

సాయంత్రం భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. సామర్లకోట వద్ద ఓ లారీ సాంకేతిక సమస్య కారణంగా రైల్వే గేట్ సమీపంలో రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో సుమారు ఐదారు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ సమయంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి రంగంపేటకు చెందిన మహిళా కానిస్టేబుల్ జయశాంతి విధి నిర్వహణలో లేకపోయినా తన బిడ్డను చంకనెత్తుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# జోగి బ్రదర్స్‌కి బెయిలు

(మొదటి పేజి (తరువాయి)

జోగి రమేశ్‌ను విజయవాడ జిల్లా జైలు నుంచి చెయ్యి నొప్పి కారణంగా ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను తిరిగి విజయవాడ జైలుకు తరలించారు. నకిలీ మద్యం తయారీకి సంబంధించి జోగి రమేశ్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో జోగి సోదరులను నిందితులుగా పోలీసులు చేర్చారు. ప్రాథమిక విచారణలో భాగంగా ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులు జోగి సోదరులను విచారించారు. ఈ విచారణలో పలు కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విచారణ ఆధారంగా పోలీసులు.. దర్యాప్తు ముమ్మరం చేశారు.

# తెలుగుదేశం డర్టీ పార్టీ

(మొదటి పేజి (తరువాయి)

'డ్వాక్రా మహిళలకు చంద్రబాబు టోకరా వేశారు. డ్వాక్రా సంఘాలను చంద్రబాబు నిర్వీర్యం చేశారు. 16,600 కోట్ల రుణాలను బ్యాంకులు తగ్గించేశాయి. మహిళలకు సున్నా వడ్డీకి రుణాలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. మహిళలకు 10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలు ఇవ్వాలి. సున్నా వడ్డీ కింద ఇవ్వాల్సిన 7000 కోట్లు బకాయిలు వెంటనే విడుదల చేయాలి. డ్వాక్రా మహిళలను ఏ విధంగా చంద్రబాబు మోసం చేశారో నాబార్డ్ నివేదికలు తెలియజేస్తున్నాయి. డ్వాక్రా మహిళలకు నాలుగు విడతల్లో వైఎస్ జగన్ రుణమాఫీ చేశారు. జగన్ హయాంలో సున్నా వడ్డీ రుణాలు మంజూరు అయ్యేవి.మహిళలు సిగ్గుతో తలదించుకునే విధంగా సంక్రాంతికి సంబరాలు జరిగాయి. కూటమి పాలనలో అశ్లీల నృత్యాలకు కేరాఫ్ అడ్రస్ గా ఏపీని మార్చారు.కూటమి నేతలు సంక్రాంతి.. సంస్కృతి సాంప్రదాయాలను మంటగలిపారు. మహిళా హోం మంత్రి ఉన్న రాష్ట్రంలో విచ్చలవిడిగా అశ్లీల నృత్యాలు, అర్ధనగ్న ప్రదర్శనలు జరిగాయి. రికార్డింగ్ డ్యాన్సులు, అర్ధనగ్న ప్రదర్శనలపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు?. బట్టలు విప్పి రికార్డింగ్ డ్యాన్సులు చేయాలన్న వారిని ఎందుకు నడి రోడ్డుపై నడిపించలేదు?. క్యాసినోలు, పేకాటలు ఆడిన వారిపై ఎందుకు కేసులు పెట్టలేదు. నడిరోడ్డుపై ఎందుకు నడిపించలేదు?. అసాంఘిక కార్యకలాపాలకు పోలీసులను కాపలాగా పెట్టారు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ధాన్యం కొన్న వెంటనే డబ్బులు

(మొదటి పేజి (తరువాయి)

లక్షల టన్నుల ధాన్యం సేకరించామని.. అందులో రూ.9,800 కోట్లు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలోని పౌరసరఫరాలశాఖ కమిషనరేట్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరుపతి, నెల్లూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కొనసాగుతుందని ఆయన వివరించారు. 'రైతులు ఇబ్బంది పడకుండా తొలిసారిగా ప్రత్యేక రైలు ఏర్పాటు చేసి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ధాన్యం తరలిస్తున్నాం. తేమ శాతం, జీపీఎస్, రవాణా సమస్యలు సమర్థంగా అధిగమించాం' అని మనోహర్ పేర్కొన్నారు. రబీలోనూ గోతాలు, రవాణా, నిల్వ సౌకర్యాల్లోనూ ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ వీసీ, ఎండీ ఢిల్లీరావు, అధికారులు పాల్గొన్నారు.

# ఏపిలో లక్షకోట్ల ప్రాజెక్ట్

**అమరావతి (తెలుగోడు), జనవరి 20 :**




ఆంధ్రప్రదేశ్‌లో రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో లక్ష ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆర్ఎంజడ్ సంస్థ ముందుకు వచ్చింది. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ఆర్ఎంజడ్ సంస్థ ఏపీలో మరో భారీ పెట్టుబడి పెట్టనుంది. మంగళవారం దావోస్‌లో ఆర్ఎంజడ్ ఛైర్మన్ మనోజ్ మెండాతో మంత్రి లోకేశ్ జరిపిన చర్చలు ఫలవంతమయ్యాయి. ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించడం, విశాఖనగరంలో జీసీసీ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా విశాఖపట్నం కాపులుప్పాడ ఫేజ్-1 ఐటీ పార్క్‌లో సుమారు 50 ఎకరాల్లో 10 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉఅఅ పార్క్‌ను అభివృద్ధి చేయడానికి ఆర్ఎంజడ్ సంస్థ అంగీకరించింది. దావోస్‌లో జరిగిన 2026 వరల్డ్ ఎకనామిక్ ఫోరం వార్షిక సమావేశంలో మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఆర్ఎంజడ్ ఛైర్మన్ మనోజ్ ఈ వ్యూహాత్మక పెట్టుబడి భాగస్వామ్యాన్ని ప్రకటించారు. విశాఖపట్నం ప్రాంతంలో దశలవారీగా 1 గిగావాట్ వరకు సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు కూడా ఆ గ్రూప్ ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. విశాఖపట్నం ప్రాంతంలో సుమారు 500 నుంచి 700 ఎకరాల భూమి అవసరం. ఈ ప్రాజెక్ట్ నెక్స్ట్ జెన్ డిజిటల్, ఏఐ వర్క్ లోడ్‌కు మద్దతు ఇస్తుందన్నారు. స్థిరత్వం, గ్రీన్ పవర్ ఇంటిగ్రేషన్‌కు ప్రాధాన్యత ఇస్తుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. మరోవైపు రాయలసీమలో టేకులోడు వద్ద ఆర్ఎంజడ్ గ్రూప్ సుమారు 1,000 ఎకరాల్లో పారిశ్రామిక, లాజిస్టిక్స్ పార్క్‌ను అభివృద్ధి చేయడానికి ప్రతిపాదించింది.



కాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం అందిస్తున్న ఆదిత్య కన్స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ, నిత్యసురభి ట్రస్ట్ చైర్ పర్సన్ డా. ఎస్. నిర్మలమురళి

# కాన్సర్ బాధితుడికి నిత్యసురభి ఆర్థిక సహాయం

**అనంతపురం రూరల్ (తెలుగోడు), జనవరి 20**

నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్ పర్సన్ డా. ఎస్. నిర్మలమురళి ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితుడికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. శ్రీ సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన పెద్ద లింగమయ్య(65) సంవత్సరం నుంచి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయం నిర్మలమురళి దృష్టికి రావడంతో సాయి ఆదిత్య కన్స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణకు విషయం తెలిపారు. దీంతో మంగళవారం పుట్టినిల్లు ఆశ్రమంలో పురుషోత్తమ మురళీకృష్ణ చేతుల మీదుగా బాధితుడికి రూ.10 వేలు సహాయం అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ అవసరంలో ఆపదలోనే ఉన్నవారికి ప్రతి ఒక్కరూ సహాయం చేయాలని కోరారు. ప్రతి ఒక్కరు వీలైనంత అవసరం ఉన్నవారికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు. నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్‌కు సహకరిస్తున్న సాయి ఆదిత్య కన్స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బాలు

# నూతన షాపింగ్ కాంప్లెక్స్ సమస్య పరిష్కరించండి

## ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి పత్రం..

**యాడికి. (తెలుగోడు) జనవరి 20 :**

నూతన షాపింగ్ కాంప్లెక్స్ సమస్య పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ కిష్టప్పకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పాతకుట్ల బాలు. చిరంజీవి వినత పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాడికి మండల కేంద్రంలో మహాత్మా గాంధీ విగ్రహం ఎదురుగా ఉన్న భవనం 2019లో ప్రారంభించినా ఈరోజుకు వాడుకలో లేదన్నారు. మండలంలో ఉన్న ఒక ఎస్సీ మహిళ వ్యాపారం చేసుకోవడానికి ఒక గది కావాలని కోర్టులో కేసు వేసిందన్నారు. దీంతో ఎస్సీలకు వేరుగా వేలం పాట పెట్టించి భవనాన్ని ప్రారంభించాలని కోరారు. భవనం వాడుకలో లేకపోవడంతో ప్రభుతత్వ, గ్రామపంచాయతీ ఆదాయానికి గండి పడుతోందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే రోజులలో గ్రామపంచాయతీ ఆఫీస్ లో పనిచేసే వాళ్లకు కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుందిదన్నారు. దీనిపై వచ్చే ఆదాయంతో యాడికి మేజర్ పంచాయతీలో చాలా అభివృద్ధి పనులు చేయవచ్చు అని అన్నారు. సమస్యను పరిగణలోకి తీసుకొని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్‌ని కోరారు.




బీజేపీ 15వ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ నబీన్‌ని సన్మానిస్తున్న బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు యస్, విష్ణు వర్ధన్ రెడ్డి



డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను డిస్ప్లేపై వివరిస్తున్న ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి

# విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కావద్దు

## ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి ..

**పెద్దపప్పూరు**

విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కావద్దు అని ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. పెద్దపప్పూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తుపదార్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ కు అలవాటు పడితే జీవితాలు ఎలా దెబ్బతింటాయన్న విషయాన్ని వివరించారు. తమ పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో కళాశాలకు పంపిస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయవద్దని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ పట్టుదలతో చదివి ఉత్తమ ర్యాంకులు సాధిస్తే అటు బోధకులకు ఇటు కళాశాలకు మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. మీ భవిష్యత్తు అధ్యాపకుల చేతుల్లో లేదని మీ పట్టుదల కృషి ఉంటే ఉన్నత స్థాయికి ఎదుగుతారని అన్నారు. ప్రతి ఒక్కరూ దీన్ని గుర్తించుకోవాలన్నారు.లీ కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్

# బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

## కేజీబీవీలో బాల్య వివాహ నిర్మూలన జాతీయ ప్రచార కార్యక్రమం ..

**పామిడి (తెలుగోడు), జనవరి 20 :**

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం అని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా మిషన్ వాత్సల్య కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.ఎన్.శ్రీదేవి, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి పేర్కొన్నారు. పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో ఎసచవతీతీచ సౌభాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం బాల్య వివాహ నిర్మూలన 100 వందరోజుల జాతీయ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు అనర్థదాయకం అని వాటి కారణంగా అనేక నష్టాలు సంభవిస్తాయని తెలిపారు. బాలికలు తమ హక్కులను పరిరక్షించుకుంటూనే క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యశిస్తూ లక్ష్యాలను సొంతం చేసుకునేవరకు వివాహం చేసుకోవద్దని సూచించారు. చదువు భవిష్యత్తుకు మార్గాన్ని చూపిస్తుందని అందువల్ల మీరంతా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఓఎస్సీ మేనేజర్ శాంతామణి, సామాజిక కార్యకర్త వెంకటకుమార్, డిసిపియు ఓఆర్డబ్ల్యూ కమలాక్షి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రామాంజినమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.



విద్యారినులను ఉద్దేశించి మాట్లాడుతున్న బి.ఎన్.శ్రీదేవి

# దుండగులు తగులబెట్టిన అరటితోట పరిశీలన

## మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డి...

**గుత్తి తెలుగోడు జనవరి 20.**

గుత్తి మండలం బేసినేపల్లి గ్రామంలో రైతు చంద్రశేఖర్ రెడ్డి 5 ఎకరాల అరటి తోటకు గుర్తు తెలియని దుండగలు నిప్పు పట్టడంతో 3 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ శాసన సభ్యులు వై.వెంకటరామి రెడ్డి మంగళవారం రైతు ను పరామర్శించి తగులబడిన అరటి తోటను పరిశీంచారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతు చంద్రశేఖర్ రెడ్డిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. తోటకు నిప్పు పట్టిన దుండగలను గుర్తించి అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. రైతుకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం యువ నేత మంజునాథ్ రెడ్డి, బసినేపల్లి నాయకులు తిమ్మారెడ్డి, బాలహనుమంత్, శివరంగనాయకులు, జంగిలి రంగనాయకులు, బి.సంజీవ, నాగరాజు, శివుడు, ప్రతాప్ రెడ్డి, భాస్కర్ రెడ్డి,వి .రామంజినేయులు, చంద్రశేఖర్ రెడ్డి, సాయిరెడ్డి, గుత్తి పట్టణ కన్వీనర్ కప్పలబండ మధుసూదన్ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, మాజీ జడ్పిటిసి ప్రవీణ్ కుమార్ యాదవ్, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మల్లయ్య యాదవ్, జిల్లా నాయకులు సుభాష్ రెడ్డి, గురు ప్రసాద్ యాదవ్, రైతు సంఘం నియోజకవర్గం అధ్యక్షులు బాబురావు యాదవ్,వైస్సార్సీపీ గుంతకల్లు పట్టణ అధ్యక్షులు.ఖలీల్, గుత్తి పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు తిక్కస్వామి, యూత్ వింగ్ నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్ బాసీత్, బేడలవెంకటరాముడు,రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



తగులబడిన అరటి తోటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డి, తదితరులు



తగులబడిన అరటి తోటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామి రెడ్డి, తదితరులు

# ఎస్‌టియు బుల్లెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ

**గుత్తి తెలుగోడు జనవరి 20.**

గుత్తి పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో మండల ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం దాత నాగరాజు, కాంట్రాక్టర్ సహకారంతో 500 మంది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 10వ తరగతి చదివే విద్యార్థులకు బుల్లెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో తయారుచేయించిన బుక్స్‌ను గుత్తి బాలికల పాఠశాలలో 150 మందికి, కోట పాఠశాలలో 80 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గుత్తి డివైయు , పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంకన్న, మండలం అధికారులు రవినాయక్, మనోహర్, దాత నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మెటీరియల్ పిల్లలకు చాలా బాగా ఉపయోగపడుతుందన్నారు. గత సంవత్సరం ఎస్‌టియు బుల్లెట్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిందన్నారు. ఉపాద్యాయుల సమస్యల పరిస్కారంతో పాటు సేవా కార్యక్రమాలలో ఎస్‌టియు ముందజలో ఉంటుందని కొనియాడారు. దాత నాగరాజు మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి ప్రయోజకులు కావాలని, చదువే అన్నిటికి మార్గం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్,రాష్ట్ర కౌన్సిలర్ కేశవ నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా నాయకులు శంకరయ్య, సూర్య ప్రకాష్ రెడ్డి, బసవరాజు, రమణయ్య, కొలంబస్, సీతానంద, కంబగిరిరాముడు, సత్యనారాయణ, కృష్ణమూర్తి, పద్మజ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పదవ తరగతి స్టడీ మెటీరియల్



దాత కాంట్రాక్టర్ నాగరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

# శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం

**యాడికి. (తెలుగోడు) జనవరి 20 :**

యాడికి మండల కేంద్రంలోని వైశ్యవీధిలో ఉన్న అమ్మవారిశాలలో మంగళవారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అమ్మవారికి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఏడు గంటల 30 నిమిషాలకు గణపతి పూజ నవగ్రహ పూజ శివపార్వతులకు మరియు వాసవి కనకా పరమేశ్వరి దేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన లలితా సహస్రనామ పారాయణము 11 గంటలకు అమ్మవారి గుండ ప్రవేశము పూర్ణాహుతి మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం నుండి అల్పాహారం, మధ్యాహ్నం అన్న ప్రసాదము వితరణ చేశారు. ఆలయ ప్రాంతమంతా జై వాసవి మాత జై జై వాసవి మాత అన్న నినాదాలతో మార్మోగింది. ఈ కార్యక్రమం యాడికి ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.



. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి





యాడికి లోని అమ్మవారిశాలలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

# ఘనంగా శ్రీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

**పామిడి (తెలుగోడు), జనవరి 20 :**

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మంగళవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అమ్మవారి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. లలితా కుంకుమార్చన, సహస్ర నామ పారాయణం పఠించి మహామంగళహారతి ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం జిల్లా ఉపాధ్యక్షులు నారాయణమూర్తి, నాయకులు నల్లయ్య, నాగార్జున, శివరంగయ్య, సుధాకర్, మాతృమాండలి గౌరవ అధ్యక్షులు రాజేశ్వరి భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రమేష్‌ను అరెస్ట్ చేసిన సీఐ శ్రీనివాసులు

# బాలుడి మృతి కేసులో తండ్రి అరెస్ట్

**యాడికి. (తెలుగోడు) జనవరి 20 :**

భార్యాభర్తల గొడవ నేపథ్యంలో రాయి తగిలి కుమారుడు చనిపోయిన సంఘటనలో తండ్రి రమేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. యాడికి మండల పరిధిలోని చందన లక్ష్మంపల్లి గ్రామంలో ఈనెల 16 తేదీ సాయంత్రం భార్యాభర్తలు మండల రమేష, మహేశ్వరి కుటుంబ విషయమై గొడవ పడ్డారు. దీంతో రమేష్ కోపంతే తలుపుకు అడ్డంగా ఉంచిన గుండ్రాయి తీసుకొని భార్య మీదకు విసరగా ఆది ఆమె చంకలో కూర్చున్న కుమారుడు రాహుల్ (4) తలకు తగిలి బలమైన గాయం అంది. చికిత్స నిమిత్తం బాలుడని తాడిపత్రిలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకుని వెళ్లి అక్కడినుండి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈనెల 18వ తేదీ రాహుల్ చనిపోయినాడు. భార్య మహేశ్వరి యొక్క ఫిర్యాదు మేరకు భర్త రమేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శివ గౌడ్. రంగనాయకులు. కానిస్టేబుళ్లు రామాజిల్ రెడ్డి. శివ. శివరామిరెడ్డి తదితర పోలీసులు పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శివగౌడ్

# మత్తు పదార్థాలు వద్దు చదువే ముద్దు

**యాడికి. (తెలుగోడు) జనవరి 20:**

మత్తు పదార్థాలు వద్దు చదువే ముద్దు అని హెడ్ కానిస్టేబుల్ శివ గౌడ్ అన్నారు. పోలీస్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు మంగళవారం యాడికి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తుపదార్థలు వాడటం కలిగే దుష్పరిణామాలని వివరించారు. సత్ప్రవర్తన, క్రమశిక్షణ గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ శివ, ఉపాధ్యాయులు శ్రీనివాస్ యాదవ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అగాపే వృద్ధాశ్రమంలో జాఫర్ సాహెబ్ 24వ వర్ధంతి

**యాడికి. (తెలుగోడు) జనవరి 20 :**

యాడికి మండల కేంద్రంలో కమలపాడు రోడ్డు రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో మంగళవారం కీ"శే"జాఫర్ సాహెబ్ హెడ్ (కానిస్టేబుల్)24వ వర్ధంతి జ్ఞాపకార్థమై ఆయన భార్య ఖాజాబి ,కుమారులు చాంద్ భాష సత్తార్,కోడళ్ళు,కుమార్తెలు షహనాజ్,షహజాది , మనవాళ్లు మనవరాలు వీరి కుటుంబము ఆశ్రమంలోని నిరాశ్రయులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఇందు నిమిత్తమై ఆశ్రమం ఫౌండర్ బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా వారి కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు.



అగాపే ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

# పోట్లమర్రి ఆంజనేయస్వామికి ఘనంగా ఆకుపూజ

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 20 :** మాఘమాసం మంగళవారంను పురస్కరించుకుని పోట్లమర్రి ఆంజనేయస్వామికి ఆకుపూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



మండలంలోని పోట్లమర్రి గ్రామంలో వెలసిన సీతారామాంజనేయస్వామి ఆలయంలో ఆలయ ప్రధాన ఆర్చకులు కొమందూరు మారుతిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. బత్తలపల్లికి చెందిన హోటల్ నిర్వహకుడు కుమ్మర సాంబశివుడు, సునీత దంపతులచే ఆకుపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. భజన బృందాలచే భజనలు నిర్వహించారు. తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అదేవిధంగా బత్తలపల్లిలోని కోల్లాపురమ్మ, బళ్లారి దురమ్మ ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నిలిపి ఉన్న లారీని వెనుక వైపు ఢీ కొట్టిన కారు

# లారీని ఢీ కొన్న కారు ఇద్దరికి తీవ్రగాయాలు

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 20 :** అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల కేంద్రమైన బత్తలపల్లి టోల్గేట్ దగ్గర పార్కింగ్ చేసిన లారీని కారు వెనుక నుంచి మంగళవారం తెల్లవారుజామున ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్షసాక్షులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు నుంచి గుంతకల్లుకు వెలుతున్న కారు బత్తలపల్లి టోల్ ప్లాజా వద్దకు రాగానే రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన లారీని వెనుక వైపున కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో వేణుగోపాల్, ప్రేమలతకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వారు డిశ్చార్జ్ అయ్యారని వైద్యులు తెలిపారు. కారులో డ్రైవర్ నవీన్ కుమార్, చార్లెస్ వరప్రసాద్, షారుణ్హర్షలు ఉన్నట్లు తెలిపారు. వారు క్షేమంగా బయటపడినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా జాతీయ రహదారిపై వాహనాల నుంచి భారీగా టోల్ ఫీజులు వసూలు చేస్తూ సౌకర్యాలు లేకనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా టోల్ ప్లాజా అధికారులు సరైన వసతులు కల్పించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కి హృదయ పూర్వక అభినందనలు

**బిజెపి రాష్ట్ర నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ ఎస్. చంద్రశేఖర్..**



**అగళి (తెలుగోడు), జనవరి 20 :** బిజెపి 15వ జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నవీన్ జీ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా బిజెపి నాయకులు ఎస్ చంద్రశేఖర్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ నితిన్ నబీన్ జీ, బీహార్‌లోని బ్యాంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారన్నారు. బీహార్ రాష్ట్ర మంత్రివర్గంలో మూడు సార్లు మంత్రిగా సేవలందించారన్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి బీజేపీ ప్రభారీగా కూడా బాధ్యతలు నిర్వహించారన్నారు. మృదుభాషి, యువతరానికి ప్రతినిధి, పార్టీ పనితీరులోని మూడు ముఖ్య అంశాలు, సంస్థాగత నిర్మాణం, ఎన్నికల ప్రచారం,ప్రజా పరిపాలన, అన్నింటిలోనూ నిష్ణాతులైన నితిన్ నబిన్ శక్తివంతమైన పార్టీకి మరింత చైతన్యాన్ని తీసుకువచ్చి, భారత ఆలోచనను ఇంకా చేరని ప్రాంతాలకు వేగంగా తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తారని విశ్వసిస్తున్నామని అన్నారు.



# పాల డెయిరీ మేనేజర్ మృతి

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 20 :** బత్తలపల్లి మండల కేంద్రంలోని శ్రీనివాస పాల డెయిరీ రీజనల్ మేనేజర్ ముప్పారపు శ్రీనివాసులు (40) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఓబుళాపురం గ్రామానికి చెందిన ఆయన గత 20 సంవత్సరాలుగా బత్తలపల్లిలో నివాసముంటూ డైరీలో సేవలందించారు. తెల్లవారుజామున బాతురూంలో అపస్మారక స్థితిలో కనిపించడంతో ఆర్డీటి ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. మాజీ ఎంపీపీ జక్కంపూటి సత్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు.



శ్రీనివాసులు (ఫైల్ ఫోటో )

# మల్బరీ సాగుపై వీడిన పట్టు!

## కుటాలపల్లిలో మారిన వ్యవసాయ ముఖచిత్రం..

**నల్లమాడ (తెలుగోడు), జనవరి 20 :** ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఒకప్పుడు మల్బరీ సాగుకు చిరునామాగా పేరొందిన నల్లమాడ మండలం కుటాలపల్లి గ్రామం నేడు పూర్తిగా భిన్నమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తోంది. కొన్ని వేల ఎకరాల్లో విస్తరించిన మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకం, రైతులకు నిలకడైన ఆదాయం ఇచ్చిన ఆనాటి రోజులు నేడు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి. గ్రామంలో ప్రస్తుతం మల్బరీ సాగు చూద్దామన్నా కనిపించని పరిస్థితి నెలకొంది.

**మల్బరీకి ఎందుకు దూరమయ్యారు..**

రైతన్నలు మల్బరీ సాగుపై పట్టు వీడడానికి ప్రధాన కారణం సంబంధిత శాఖల నుంచి సరైన సహకారం లేకపోవడమేనని రైతులు వాపోతున్నారు. పట్టు పురుగుల పెంపకానికి అవసరమైన సాంకేతిక మార్గనిర్దేశం, నాణ్యమైన మొక్కలు, మార్కెటింగ్ మద్దతు, ధరల భరోసా లాంటి అంశాల్లో ప్రభుత్వ విభాగాల నిర్లక్ష్యం మల్బరీ సాగును క్రమంగా నిర్వీర్యం చేసిందని రైతుల అభిప్రాయం. ఒకప్పుడు ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యధికంగా మల్బరీ సాగు చేసే గ్రామంగా గుర్తింపు పొందిన కుటాలపల్లిలో, నేడు ఆ గుర్తింపుకు ఆనవాళ్లు కూడా కనిపించకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

**మారిన పంటల ధోరణి..**

మల్బరీ స్థానాన్ని ప్రస్తుతం మొక్కజొన్న, వేరుశనగ, ఇతర వాణిజ్య పంటలు ఆక్రమించాయి. గ్రామంలో దాదాపు ప్రతి కుటుంబం వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తుండగా, ఈ పంటలే ప్రధాన ఆధారంగా మారాయి. అయితే అధిక దిగుబడుల కోసం రైతులు రసాయన ఎరువులపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుండటంతో పెట్టుబడులు భారీగా పెరుగుతున్నాయి.

**ధరల అస్థిరతతో రైతుల ఆందోళన..**

ఇదే సమయంలో ప్రభుత్వం ధరల స్థిరీకరణపై స్పష్టమైన చర్యలు తీసుకోకపోవడం రైతులకు మరో సమస్యగా మారింది. మంచి దిగుబడి వచ్చినప్పుడు మార్కెట్లో ధరలు పడిపోతుండటంతో ఆశించిన లాభాలు దక్కడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన పెట్టుబడులకు తగిన ఆదాయం రాకపోతే భవిష్యత్తులో పంటల సాగు భారంగా మారే అవకాశం ఉంటుందని ఆ గ్రామ రైతులు తెలిపారు.



సాగుచేసిన వేరుశనగ పంట



కుటాలపల్లిలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

**పునరాలోచన అవసరం..**

కుటాలపల్లి గ్రామంలో మల్బరీ సాగు క్షీణత కేవలం ఒక గ్రామ కథ మాత్రమే కాదు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ మద్దతు ఎంత కీలకమో తెలియజేసే ఉదాహరణ. మల్బరీ సాగు వంటి నిలకడైన, ఉపాధి కల్పించే వ్యవసాయ విధానాలను తిరిగి ప్రోత్సహించాలంటే, సాంకేతిక సహాయం, మార్కెట్ భరోసా, ధరల స్థిరీకరణ వంటి అంశాల్లో ప్రభుత్వ జోక్యం అనివార్యం. లేకపోతే ఒకప్పుడు పట్టు పరిశ్రమతో కళకళలాడిన కుటాలపల్లి వంటి గ్రామాలు, పెరుగుతున్న పెట్టుబడులు--పడిపోతున్న ధరల మధ్య రైతుల ఆందోళనకు నిలయాలుగా మారే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది..

### దశాబ్దాల పాటు ఊర్లో మల్బరీ సాగు

**జి చంద్రహాస్ రెడ్డి, రైతు కుటాలపల్లి.**



కొన్ని దశాబ్దాల పాటు మా ఊరిలో మల్బరీ సాగు జరిగింది. మల్బెరి సాగులో దిగుబడులు సాధించేందుకు ఇంటిల్లిపాది శ్రమించేవాళ్లం. ఊర్లో రైతులందరూ మల్బరీ సాగు పైన ఆధారపడి జీవనం కొనసాగించాం. అయితే ప్రభుత్వం నుండి సరైన ప్రోత్సాహం అందక, గిట్టుబాటు ధరలు లేక మల్బరీ సాగుకు దూరం కావాల్సి వచ్చింది. ప్రస్తుతం మా ఊరిలో మొక్కజొన్న, వేరుశనగ అత్యధికంగా సాగులో ఉండగా, మరికొంతమంది రైతులు టమోటా, తరవాణించే పంటలు సాగు చేస్తున్నారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న రైతులకు నష్టాలే వెంటాడుతున్నాయి. ధరల స్థిరీకరణ పై చర్యలు చేపట్టి పదిమందికి అన్నం పెట్టే రైతన్నలకు లాభం చేకూరేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటే వ్యవసాయం రంగం అభివృద్ధిలో ఉంటుంది. లేదంటే భవిష్యత్తులో వ్యవసాయం దండగగా మారుతుంది..

# వేరుశనగలో జిప్సం వాడకంతో అధిక దిగుబడులు

## ఎకరాకు 200 కిలోల జిప్సం వేయాలి.. జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య..

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 20 :** వేరుశనగ పంటలో జిప్సం వినియోగం ద్వారా కాయ నాణ్యతతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని అప్ప్రచెరువు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతుల పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వేరుశనగ పంట పూత దశలో ఉన్నందున, ఎకరాకు 200 కిలోల జిప్సం తప్పనిసరిగా వేసుకోవాలని సూచించారు. దీని వల్ల కాయల అభివృద్ధి మెరుగుపడి దిగుబడులు పెరుగు తాయని వివరించారు. అలాగే ఆకుమచ్చ తెగులు నివారణకు లీటరు నీటికి 2.5 గ్రాముల మాన్కోజెబ్ లేదా 1.5 నుండి 2 మిల్లీలీటర్ల హెక్సాకోనజోల్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, ఎరువులు, పురుగుమందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని దుకాణదారులకు ఆదేశించారు. అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు.రబీ సీజన్?కు సంబంధించి వ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు. ఈ నమోదు ద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలు, పంట బీమా వంటి ప్రయోజనాలు సకాలంలో అందుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, గ్రామ వ్యవసాయ సహాయకుడు సత్యనారాయణ , స్థానిక రైతులు పాల్గొన్నారు.




పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య



ఎరువుల దుకాణంలో ఆకస్మిక తనిఖీ చేస్తున్న అధికారులు

# ఘనంగా శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

**అమరాపురం (తెలుగోడు), జనవరి 20 :** అమరాపురం ఎంపీడీవో కార్యాలయంలో శ్రీ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇంచార్జ్ ఎంపీడీవో ఆరాధ్య ఈ. ఓ. ఆర్. డి. ప్రసాద్, శ్రీ, వాసవి మాత చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆర్యవైశ్యులకు ఆరాధ్య దేవత శ్రీ వాసవాంబ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అమరాపురం ఎంపీడీవో కార్యాలయంలో వాసవి మాతకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# వైభవంగా శ్రీ ఓంకారేశ్వర ఆలయం 7వ వార్షికోత్సవం

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 20 :** బత్తలపల్లిలో వెలసిన శ్రీలలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వర స్వామి దేవస్థానం ఏడవ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణం అంతటా శివ నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఆలయ శాశ్వత ధర్మకర్తలు కోటి సూర్యప్రకాష్ బాబు, కోటి సుధ దంపతుల ఆధ్వర్యంలో, అర్చకులు విరూపాక్ష రాజేష్ స్వామి పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఉదయం గణపతి పూజ, గోపూజ, స్వస్తి పుణ్యాహవచనం, కలశారాధన, అగ్ని ప్రతిష్టాపన, గణపతి హోమం నిర్వహించగా, సాయంత్రం స్వామివారికి విశేష రుద్రాభిషేకం, సామూహిక రుద్రహోమం చేశారు. ఈ వేడుకలకు శివదీక్ష మాలధారులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ధర్మకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది.



కలశారాధన చేస్తున్న దృశ్యం
గోపూజ నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు



పూజలు అందుకుంటున్న శ్రీ లలితా త్రిపరసుందరి సమేత ఓంకారేశ్వరుడు.



పోట్లమర్రి చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ స్వర్ణలత

# అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

**అమలుపై సందేహాలు..**

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 20 :** పోట్లమర్రి చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్న అంశం బత్తలపల్లి మండలంలో రాజకీయంగా ఉద్రిక్తతకు దారితీసింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్ స్వర్ణలత అక్రమంగా మట్టి, ఇసుక తరలింపులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం ధర్మవరం ఆర్డీవో మహేష్ చెరువును పరిశీలించి వెళ్లిన తర్వాత, బత్తలపల్లి తహసిల్దార్ స్వర్ణలత చెరువును పరిశీలించారు. అమె వెంట రాజశేఖర్, రాణాప్రతాప్ పాల్గొన్నారు. చెరువు మట్టిని పొలాలకు తరలించాలనుకునే రైతులు తప్పనిసరిగా ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకోవాలని, ఆ విషయాన్ని రెవెన్యూ, పోలీసు శాఖలకు ముందుగా తెలియ జేయాలని ఆమె తెలిపారు.అ యితే మండలంలోని పలు గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తున్నారన్న ఆరోపణలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి. అలాంటి సందర్భాల్లో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్న విమర్శలు ఉన్నాయి.ఈ పరిస్థితుల్లో అధికారులు చేస్తున్న హెచ్చరికలు కాగితాలకే పరిమితమవుతాయా? లేక అక్రమాలకు పాల్పడుతున్న వారిపై నిజంగా చర్యలు తీసుకుంటారా అన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అన్ని వర్గాలపై సమానంగా చట్టం అమలైతేనే అధికారుల ప్రకటనలకు విలువ ఉంటుందని మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



పొట్లమరిలో పశువైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జాయింట్ డైరెక్టర్ సుబాదాస్,

# ఉచిత పశు ఆరోగ్య శిబిరాలతో రైతన్నలకు మేలు

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 20 :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు, గొర్రెల కాపర్లు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుభదాస్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రమీలరాణి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పోట్లమర్రి, డి.చెర్లోపల్లి పంచాయతీల్లో నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పశువుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు.ఈ శిబిరాల్లో 87 పశువులకు సాధారణ వైద్య పరీక్షలు,37 పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు, మూడు ఆవులకు కృత్రిమ గర్భధారణ, 327 పాడి పశువులకు నట్టల నివారణ మందులు అందించారు.రైతులకు పశువుల పోషణ, వ్యాధుల నివారణపై పలు సూచనలు ఇచ్చారు. పశు భీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగకరమని, రాష్ట్ర ప్రభుత్వం 85 శాతం ప్రీమియం భరిస్తుందని, రైతులు కేవలం 15 శాతం మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బత్తలపల్లి పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. శ్రీనివాసులు, పశు వైద్యాధికారులు గుర్నాథరెడ్డి, యు. శ్రీనివాసులు, ల్యాబ్ టెక్నీషియన్ నాగవేణి, పశువైద్య సిబ్బంది, గోపాలమిత్రులు, పాడి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




ముదిగుబ్బ జామియా మసీదులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

# కడపలో ఏపీ-తెలంగాణ సంయుక్త మహత్తర దీనీ ఇజ్తెమా

**ముదిగుబ్బ జామియా మసీదులో పోస్టర్ల ఆవిష్కరణ**

**ముదిగుబ్బ (తెలుగోడు), జనవరి 20 :** ముదిగుబ్బ పట్టణంలోని జామియా మసీదులో మంగళవారం ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కడప జిల్లాలో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ -- తెలంగాణ రాష్ట్రాల సంయుక్త మహత్తర దీనీ ఇజ్తెమాకు సంబంధించిన పోస్టర్లను ఘనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా మసీదు ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ కడప జిల్లా పులివెందుల రోడ్డులోని కొప్పర్తి ఇండస్ట్రియల్ ప్రాంతంలో జనవరి 23, 24, 25 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ భారీ స్థాయి దీనీ ఇజ్తెమా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది ముస్లిం సోదరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ మహత్తర ఇజ్తెమాలో ప్రముఖ ఉలమా, ఇస్లామీయ పండితులు పాల్గొని ఇస్లామీయ జీవన విధానం, ఆధ్యాత్మికత, నైతిక విలువలు, సమాజ బాధ్యతలు వంటి అంశాలపై ప్రబోధాత్మక ప్రసంగాలు ఇవ్వనున్నారని వివరించారు. అలాగే ప్రత్యేక నమాజులు, దువాలు, ఖురచవతీతీచన్ పఠనం, ఇతర దీనీ కార్యక్రమాలు విశేషంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఇజ్తెమా ద్వారా ముస్లిం సమాజంలో ఐక్యత, సోదరభావం, శాంతి, ధార్మిక చైతన్యం మరింత బలపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. నేటి సమాజంలో నైతిక విలువలను బలోపేతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని వారు అన్నారు. ప్రతి ముస్లిం సోదరుడు ఈ అరుదైన ఆధ్యాత్మిక అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కుటుంబ సమేతంగా హాజరై ఈ మహత్తర దీనీ ఇజ్తెమాను విజయవంతం చేయాలని ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ల విడుదల కార్యక్రమంలో ముస్లిం సంక్షేమ సంఘం నాయకులు, జామియా మసీదు కమిటీ సభ్యులు, పట్టణంలోని పలువురు పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న కారు

**ఇద్దరికి తీవ్రగాయాలు**

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 20 :** అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని కోడేకండ్ల వద్ద మంగళవారం ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోడేకండ్ల గ్రామానికి చెందిన ఓ వృద్ధురాలు బెంగుళూరులో అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు అంత్యక్రియలు చేయడానికి కోడేకండ్లకు తీసుకువచ్చారు. అంత్యక్రియలకు ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన ఆదెప్ప, బెంగుళూరులో నివాసముంటున్న రాజా రత్నం ఇరువురూ ద్విచక్రవాహనంలో కోడేకండ్లకు వెళ్తుండగా కదిరి వైపు నుంచి బత్తలపల్లికి వస్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెలుతున్న ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే బత్తలపల్లి ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



నేత్ర దాతల కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

# మరణంలోనూ దాతృత్వం

### తల్లీకూతుళ్ల నేత్రదానం.. ఇద్దరికి కంటి చూపు

**ఎమ్మిగనూరు (తెలుగోడు), జనవరి 20 :**
ఘోర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు మండల యువజన విభాగ ం అధ్యక్షులు బనవాసి బసిరెడ్డి భార్య రాధ (36), ఆయన కుమార్తె లక్ష్మీ దుర్గ (8) మరణానంతరం మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచారు. మృతదేహాలను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా నేత్రదానం ప్రాముఖ్యతను వైద్యులు వివరించగా, తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ కుటుంబ సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించి తల్లీకూతుళ్ల కళ్లను దానం చేయడానికి సమ్మతి తెలిపారు. దీంతో వెంటనే ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ టీమ్ ఆసుపత్రికి చేరుకుని అన్ని వైద్య నిబంధనలు పాటిస్తూ శ్రీమతి రాధ (36), చిన్నారి లక్ష్మీ దుర్గ (8) కళ్లను సురక్షితంగా సేకరించింది. వీరి నేత్రదానం ద్వారా ఇద్దరు అంధులకు చూపు వచ్చే అవకాశం కలిగిందని వైద్యులు తెలిపారు. తీరని దుఃఖంలోనూ ఇతరుల జీవితాల్లో వెలుగు నింపిన వీరి కుటుంబ నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలిచింది.



నేత్రదానం చేసిన తల్లీకూతుళ్లు రాధ, లక్ష్మీ



కోట్ల చెరువులో తెప్ప వదుతున్న గ్రామస్తులు

# తోట్ల చెరువులో ఘనంగా తెప్పోత్సవం

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 20 :**
మండలంలోని కెంచన బల్ల గ్రామంలోని తోట్లచెరువులో తెప్పోత్సవం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఇటీవల హంద్రీ-నీవా కాలువ ద్వారా తోట్ల చెరువుకు నీరు చేరడంతో మరవ వెళ్ళింది. దీంతో కెంచనబల్ల గ్రామస్తులు కృష్ణమ్మ జలాలకు మంగళ హారతులు ఇచ్చి జంతు బలిదానం చేశారు. అనంతరం తెప్పెకు రంగు రంగుల పూలతో సుందరంగా అలంకరించి చెరువు నలుమూలల తిప్పించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సందడి నెలకొల్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎసచవతీతీచర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతల మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆనంద రెడ్డి,ఆంజనేయ రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్,ఏఎంసి చైర్మన్, మాజీ చైర్మన్ జిఎం రాజు, సత్యేంద్ర శేఖర్, నేతలు రామ్మూర్తి, కృష్ణ నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, సత్తి, జయశంకర్, శంకరాచలం, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజుపేట ప్రధాన వీధిలో పశువులను పరుగులు తీస్తున్న దృశ్యం

# రాజపేటలో ఘనంగా పశువుల పండుగ

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 20 :**
మండల పరిధిలోని రాజుపేట గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఘనంగా పశువుల పండుగను గ్రామస్తులు నిర్వహించారు. మంగళవారం ఉదయం పశువులను శుభ్రం చేసి రంగురంగు పూలతో సుందరంగా అలంకరించారు. గంగమ్మ ఆలయం వద్ద విశేష పూజలు చేసి ప్రధాన వీధిలో పరుగులు తీయించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పరుగులు తీస్తున్న పశువులను తిలకించారు.

# ఇరిగేపల్లిలో ఉచిత పశు వైద్యశిబిరం

### జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్.

**అగళి (తెలుగోడు), జనవరి 20 :**
మండలం పరిధిలోని ఇరిగేపల్లి గ్రామ పంచాయతీలో మంగళవారం పశువైద్యాధికారి ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది వెటర్నరీ అసిస్టెంట్ శివకుమార్ ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయంతో పాటు వ్యవసాయ ఆధారిత పశుగణాభివృద్ధిని ఎంతో అభివృద్ధి చేస్తుందన్నారు. గ్రామాల్లో రైతులకు వెన్ను దన్నుగా నిలుస్తున్న పశువులను కూడా ఆరోగ్యంగా ఉంచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు.ఏ ఉచిత ఆరోగ్య శిబిరాలలో పశువులకు వచ్చే వ్యాధులు,నివారణ మార్గాలపై పశు వైద్య సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. పశుగణాభివృద్ధి తో వ్యవసాయం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. దాంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకొని కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవచ్చనిఅన్నారు.అనంతరం పశు వైద్య సిబ్బంది పలు పశువులకు వైద్య సేవలు అందించి,ఉచితంగా మందులను అందజేశారు.అనంతరం ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ వైస్ ఎంపీపీ గాయత్రి హేమంత్ రాజ్ మాజీ ఎంపీపీ మల్లేష్ మాజీ సర్పంచ్ నింగన్న గ్రామ సర్పంచ్ సోదరుడు మంజు చరణ్ పశు వైద్య సిబ్బంది సచివాలయ సిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పశువైద్యాధికారులు, నాయకులు, రైతులు

# నేరాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలి

### జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ..

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 20 :**
నేర నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. పెద్దకడబూరు పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్?లోని వివిధ రికార్డులు, కేసుల ఫైళ్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్?లో నమోదైన కేసులలో పెండింగ్?లో ఉన్న కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతిపై ఎసచవతీతీచ నిరంజన్ రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో వేగం పెంచి, నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ప్రజల భద్రత కోసం ఎక్కువగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితులు పోలీస్ స్టేషన్?ను ఆశ్రయించినప్పుడు వారికి సత్వర న్యాయం జరిగేలా, వారి సమస్యలకు సమగ్రంగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళా చట్టాలు, నూతన క్రిమినల్ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతోపాటు ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, కోసిగి సీఐ మంజునాథ్, ఎస్సై నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు.



పెద్దకడబూరు పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



పెద్దకడబూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలపై ఆరా తీస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



విశేషాలంకరణలో
కన్యకా పరమేశ్వరి అమ్మవారు

# కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆత్మార్పణ దినోత్సవం పూజలు

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 20**
మండలంలోని ఆనిగానూరు, రామకుప్పంలో శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా విశేష పూజలు చేశారు. మంగళవారం ఉదయం పంచామృతభిషేకం, అలంకరణ నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. స్థానికులు అధిక సంఖ్యలో తరలివచ్చి కొబ్బరికాయలు కొట్టి మొక్కలు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం వారు పాల్గొన్నారు.

# ఏడు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి

### ఎస్ఎస్ ట్యాంక్ వద్ద సీపీఎం నిరసన

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 20 :**
పెద్దకడబూరు మండలంలోని పలు గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొందని సీపీఎం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై మంగళవారం నౌలేకల్ ఎస్ఎస్ ట్యాంక్ సమీపంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు నౌలేకల్ ఎస్ఎస్ ట్యాంక్‌ను సీపీఎం నాయకులు పరిశీలించి, తాగునీటి సరఫరా పరిస్థితిపై స్థానిక ప్రజల నుంచి వివరాలు సేకరించారు. కల్లుకుంట, నౌలేకల్, మేకడోణ, ముచ్చిగిరి, తారాపురం, రంగాపురం, చిన్నకడబూరు గ్రామాలకు ఎస్ఎస్ ట్యాంక్ ద్వారా తాగునీరు సరఫరా అవుతున్నప్పటికీ ప్రస్తుతం సరైన విధంగా నీరు అందడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. కొన్ని గ్రామాల్లో ప్రతి కాలనీకి 7 నుంచి 10 రోజులకు ఒకసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతుండగా, మరికొన్ని చోట్ల 4 నుంచి 6 రోజులకు ఒకసారి మాత్రమే తాగునీరు వదులుతున్నారని ఆరోపించారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న అన్నారు. కల్లుకుంట గ్రామానికి సంబంధించిన తాగునీటి మోటర్ చెడిపోవడంతో అక్కడ నీటి సరఫరా మరింత అంతరాయం ఏర్పడిందని తెలిపారు. చెడిపోయిన మోటర్‌ను తక్షణమే రిపేర్ చేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే ట్యాంక్ వద్ద పగలు ఒక మోటర్, రాత్రి ఒక మోటర్‌ను ఆన్ చేసి నిరంతర తాగునీటి సరఫరా చేయాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆయా గ్రామాల ప్రజల తరఫున మరింత తీవ్ర ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.



చెడిపోయిన కరెంట్ మోటర్ పరిశీలిస్తున్న సీపీఎం నేత తిక్కన్న



ఎస్ఎస్ ట్యాంకు వద్ద ఫిల్టర్ బెడ్లను పరిశీలిస్తున్న సీపీఎం నేత తిక్కన్న

# విపత్తు ల్లోసాంకేతికత వినియోగంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం

**అమరావతి (తెలుగోడు), జనవరి 20**
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్?మెంట్ సౌత్ క్యాంపస్ కొండపావులూరులో విపత్తు సంసిద్ధత, ప్రతిస్పందనలో అభివృద్ధి చెందుతున్న సాంకేతికత వినియోగంపై నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో భాగంగా 10 రాష్ట్రాలకు చెందిన స్టేట్ లెవెల్ అధికారులు మంగళవారం ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌ను సందర్శించారని ఎగ్జిగ్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్ తెలియజేశారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలలో నూతన సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఈ ట్రైనింగ్ ఉపయోగపడుతుందని ఈడి దీపక్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్డిఎంఏ ఎసచవతీతీచవోసి ఇంచార్జ్ పీటర్, కెపాసిటీ బిల్డింగ్ ఆఫీసర్ తనూజ, ప్రాజెక్ట్ మేనేజర్లు బస్వంత్, సతీష్, కిషోర్, పూర్ణ చంద్ పాల్గొన్నారు. వాతావరణ స్మార్ట్ డాష్‌బోర్డ్‌లు, డెసిషన్ సపోర్ట్ సిస్టమ్‌లు, కమాండ్ కంట్రోల్ సెంటర్ ఆపరేషనల్ వర్క్‌ఫ్లో గురించి సిబ్బంది వారికి వివరించారు. డిజిటల్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా ఇంటెలిజెన్స్ ద్వారా ప్రమాద సంఘటనలపై త్వరితగతిన ప్రతిస్పందించే అంశాలు విపత్తుల సంస్థ అధికారులు వివరించారు.



వైఎస్సార్సీపీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి, సమావేశానికి హాజరైన నాయకులు

# గ్రామస్థాయిలో వైఎస్సార్సీపీ బలోపేతమే లక్ష్యం

### ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి..

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 20 :**
మంత్రాలయం మండలం రాంపురంలో నియోజకవర్గ స్థాయి వైఎస్సార్సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్.వి. మోహన్ రెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు పురుషోత్తం రెడ్డి, పెద్దకడబూరు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యంగా 17 కమిటీలను ఏర్పాటు చేసి, ప్రతి కార్యకర్తకు వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంతకాలతో కూడిన గుర్తింపు కార్డులు అందిస్తామని తెలిపారు. గుర్తింపు కార్డు పొందిన కార్యకర్తల పనితీరును జగన్మోహన్ రెడ్డి నేరుగా పర్యవేక్షిస్తారని వెల్లడించారు. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి, కౌతాళం, పెద్దకడుబూరు, మంత్రాలయం మండలాల్లో కొందరు అధికారులు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలను భయాందోళనకు గురి చేస్తూ పనులు చేయకుండా అడ్డుకుంటున్నారని తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారు తమ పనితీరును మార్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

**బాలనాగిరెడ్డి విజయమే జగన్‌కు తొలి కానుక..**

మంత్రాలయం నుంచి మరోసారి బాలనాగిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించి వైఎస్ జగన్ కు కానుకగా ఇవ్వాలని వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో అన్ని అనుబంధ కమిటీలు, గ్రామ కమిటీల్లో కార్యకర్తలు చురుగ్గా పాల్గొని రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్సీపీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి విజయాన్ని తొలి కానుకగా జగన్మోహన్ రెడ్డి అందించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**కార్యకర్తలకు గుర్తింపు తప్పక లభిస్తుంది..**

కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ నియోజకవర్గ స్థాయి సమావేశానికి భారీగా హాజరు కావడం వైఎస్సార్సీపీ కుటుంబంపై ఉన్న అభిమానానికి నిదర్శనమని వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల కన్వీనర్లు, అధ్యక్షులు, నాయకులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ స్థాయి అనుబంధ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డిని కలిసిన దయ్యాల బ్రదర్స్. వీల్ ఛైర్‌లో వచ్చిన వైసీపీ నేత నారాయణ గౌడ్‌తో మాట్లాడుతున్న ఎస్వీ మోహన్ రెడ్డి. జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డిని సన్మానిస్తున్న వైసీపీ నేతలు



పూజలందుకున్న శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు

# శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ మహోత్సవం

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 20 :**
దువ్వూరు మండల కేంద్రంలోని శ్రీ మరకత సహిత వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ మహోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. దువ్వూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

***శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు ..***

మాఘ శుద్ధ విదియ పర్వదినాన్ని పురస్కరించుకొని, ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మి నరసింహ మూర్తి ఆధ్వర్యంలో వేకువజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి పంచామృతాభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం ఆర్యవైశ్య మహిళల ఆధ్వర్యంలో కుంకుమార్చన పూజలు జరిగాయి. అనంతరం మహా మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఆరవేటి సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు లింగం పట్టాభి రామయ్య, వీవీ స్వామి, ఆరవేటి రవీంద్రనాథ్, బచ్చు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షుడు యాదళ్ల రామకృష్ణ, కార్యదర్శి దేవతి రామయ్య, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, మహిళా సంఘం సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# రేషన్ షాప్ డీలర్లతో సమావేశం

**సిఎన్‌డిటి మల్లేష్..**

**యాడికి (తెలుగోడు), జనవరి 20 :**
యాడికి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని రేషన్ షాప్ డీలర్లతో సిఎన్‌డిటి మల్లేష్, ఆర్ఐ కిష్టప్ప సమావేశం నిర్వహించాడు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రేషన్ షాప్ డీలర్లకు వివరిస్తూ ప్రతి నెల ఒకటో తేదీ నుండి ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు బియ్యం సక్రమంగా అందివ్వాలని అలాగే తూకంలో తేడా రాకుండా చూడాలని వారు సూచించాడు. అలాగే 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ప్రభుత్వం నిబంధనల ప్రకారం 26 నుండి 30 తేదీ వరకు ఇంటి వద్దకు వెళ్లి బియ్యం పంపిణీ చేయాలని తెలిపాడు. ఇక ముందుకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని డీలర్లకు సూచించారు. డీలర్లకు ఇచ్చిన లిస్టులో ఎవరైనా చనిపోయినట్లయితే వారి వివరాలను ఆయా వీఆర్వోలకు ఇచ్చి పేరు నమోదు చేయించాలని. ప్రజలకు ఈ కేవైసీ మండలంలో పెండింగ్ లో ఉన్నావారికి తప్పనిసరిగా చేయించాలని వారు సూచించారు లేకుంటే ప్రభుత్వ పథకాలు నిత్యావసర వస్తువులు వర్తించవని తెలిపాడు. పతి డీలరు స్టోర్ వద్ద నిత్యావసర వస్తువుల పట్టిక వాటి రేట్లు బోర్డు ఏర్పాటు చేయాలని తదితర వాటిపై డీలర్లకు అవగాహన కలిగించారు . స్టోర్ బియ్యం అక్రమాలను అరికట్టడానికి ప్రభుత్వం రసాయన ద్రవం అధికారులకు ఇచ్చారని కొందరు వ్యాపారస్తులు ఎక్కడైనా స్టోర్ బియ్యాన్ని కొనుకోలు చేసి సన్న బియ్యం గా మార్చి అక్రమ రవాణా చేస్తూ అధికారులకు పట్టు పడిన ఆ బియ్యాన్ని షాంపులు తీసుకొని రెండు రకాల ద్రవం పదార్థాలలో వాటిపై పిచ్చికారి చేస్తే రెండు నిమిషంలో ఎరుపు రంగులో బియ్యం మారిపోతాయని డీలర్లు జాగ్రత్తగా గమనించాలన్నారు. మీరు తూకాలు గోడన్ నుండి బియ్యం కొలతలు సక్రమంగా వేసుకొని ప్రజలకు కూడా డబ్బా లేకుండా సక్రమంగా తూకాలు ఇవ్వాలని సూచించారు.

# పోలవరం ప్రాజెక్ట్‌లో రెండోరోజు విదేశీ నిపుణుల బృందం పర్యటన

**పోలవరం, జనవరి 20:**
పోలవరం ప్రాజెక్ట్ లో విదేశీ నిపుణుల బృందం రెండో రోజు పర్యటించింది. విదేశీ నిపుణులు సీన్ హించిబెర్గర్ , డేవిడ్ బి పాల్ , జియాన్ ఫ్రాంకో డి సీకోలతో పాటు కేంద్ర జల వనరుల శాఖలోని వివిధ విభాగాల సీనియర్ అధికారులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. రెండో రోజు మధ్యాహ్నం వీరు మెయిన్ డాం గ్యాప్ 1 లో మట్టి పటిష్టత ఎలా ఉందొ పరిశీలించారు. ఇప్పటికి మట్టిని గట్టి పరిచిన ప్రాంతంలో కొంత మేర తవ్వి అక్కడ గట్టి దనం ఎలా ఉందొ లోపలకు దిగి పరిశీలించారు. మరో చోట బంక మట్టిని వేసి దానిని పటిష్ట పరిచే తీరును పరిశీలించారు. బంక మట్టి పరిచి రోలర్ తిప్పిన తరువాత ఎంత మేర గట్టి పడుతుందో చూసారు. అంతకు ముందు కేంద్ర, రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ఎం ఈ ఐ ఎల్ ప్రతినిధులతో సమావేశమై తొలి రోజు ఫీల్డ్ లో తమ దృష్టికి వచ్చిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. గ్యాప్ 2 ఆకృతులపై చర్చించారు. రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు ఎం వెంకటేశ్వర రావు, ఈ ఎన్ సి కె నరసింహామూర్తి, పోలవరం ప్రాజెక్ట్ ఎస్ ఈ ఆర్ రామచంద్ర రావు, ఎం ఈ ఐ ఎల్ జనరల్ మేనేజర్ ఏ గంగాధర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ మురళి పమ్మి తదితరులు అంతర్జాతీయ నిపుణుల బృందంతో పాటు కేంద్ర జలవనరుల శాఖ అధికారులకు వివరాలు అందించారు. వారి వివరాలతో పాటు తాము ఫీల్డ్లో సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించుకొని సందేహాలు తీర్చుకున్నారు. ఈ బృందంలో కేంద్ర ప్రభుత్వ అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి , మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, అధికారులు మనీష్ గుప్తా , రవి అగర్వాల్ , సీడబ్ల్యూపీచస్ ప్రతినిధి వి ఎస్ రామారావు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, డైరెక్టర్ కె శంకర్, ఎన్ ఐ ఆర్ ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతాని తదితరులు ఉన్నారు.

# పేదలకు వరం సీఎం సహాయ నిధి

**సహాయ నిధిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి ..**
**ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ..**

**ప్రొద్దుటూరు (తెలుగోడు), జనవరి 20 :**
రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఓ వరం లాంటిదని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో పేదల ఆరోగ్య కోసం సీఎం సహాయ నిధి కింద 104 మందికి మంజూరైన 35.72 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి

చేపట్టిన నాటి నుండి నేటి వరకు 21 విడతలుగా సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశామన్నారు. అందులో భాగంగా 22వ విడతగా ఈ చెక్కులు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి వారి ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉండి వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక సంజీవనిలా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వెంటనే స్పందిస్తూ పూర్తిస్థాయిలో ఆర్థిక సహాయం అందిస్తూ ఎందరో పేదల ప్రాణాలను నిలబెడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల పూర్తి భరోసా కల్పిస్తూ ప్రతి నిరుపేద కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పంట నమోదు తప్పనిసరి

**రైతుల లబ్ధికి ప్రామాణికం..**
**మండల వ్యవసాయ అధికారి వెంకట కృష్ణారెడ్డి..**

**ముద్దనూరు (తెలుగోడు), జనవరి 20 :**
పంటలు వేసిన ప్రతి రైతుకు ప్రభుత్వ లబ్ధి అందాలంటే పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలోని డీఎం పల్లెలో గిరిబోయిన రమేష్‌బాబు పొలంలో మంగళవారం నిర్వహించిన ‘పొలం పిలుస్తుంది’ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగు చేసిన బత్తాయి పంటను పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందించారు. బత్తాయి పంటలో సమగ్ర పోషకాల యాజమాన్యం పాటించాలన్నారు. పోషకాలను సమపాళ్లలో అందిస్తే సూక్ష్మ పోషకాల లోపం తలెత్తకుండా కాపాడుకోవచ్చని చెప్పారు. ఇందుకోసం ఫార్ములా–6 పోషకాలను లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందని సూచించారు. రైతులు రబీలో సాగు చేసిన అన్ని పంటలను తప్పనిసరిగా



‘పొలం పిలుస్తుంది’ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



‘పొలం పిలుస్తుంది’ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పంట నమోదు చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్ పథకం వర్తించే రైతులు తమ రైతు విశిష్ట సంఖ్య (=×చీ) కోసం పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు వేపనూనె అందుబాటులో ఉందని, ప్రతి పంటలో వేపనూనె వాడితే మంచి ఫలితం ఉంటుందని చెప్పారు. లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల చొప్పున వేపనూనె కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

అనంతరం డీఎన్ పల్లె గ్రామంలో సాగు చేసిన ఉలవ పంటను పరిశీలించి రైతు గిరిబోయిన రమేష్?కు తగిన సలహాలు అందించారు. వ్యవసాయ శాఖ అమలు చేసే పథకాలపై ఎప్పటికప్పుడు సమాచారం పొందాలంటే ఏపీ ఏఐఎంఎస్ యాప్?ను స్మార్ట్?ఫోన్?లో డౌన్?లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రైతులు అనవసరంగా క్రిమిసంహారక మందులు వాడకూడదని, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారకాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా నగదు బిల్లులు తీసుకుని భద్రపరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీఏఏ పి.కన్నా, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆర్.రామసుధ, రాధిక, అలాగే రైతులు యూ.దస్తగిరి, చిన్న దస్తగిరి, వేణుగోపాల్?రెడ్డి, రమేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆవులెన్నలో పశు ఆరోగ్య శిబిరం

**ఉచిత పశు ఆరోగ్య శిబిరాల పోస్టర్లు ఆవిష్కరణ..**
**సర్పంచ్ రామ్మోహన్ చౌదరి..**

**బెళుగుప్ప (తెలుగోడు), జనవరి 20 :**
బెళుగుప్ప మండలం పరిధిలోని ఆవులెన్న గ్రామంలో మంగళవారం పశు వైద్య సిబ్బంది ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ రామ్మోహన్ చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయంతో పాటు వ్యవసాయ ఆధారిత పశుగనాభివృద్ధిని ఎంతో అభివృద్ధి చేస్తుందన్నారు. గ్రామాల్లో రైతులకు వెన్ను దన్నుగా నిలుస్తున్న పశువులను కూడా ఆరోగ్యంగా ఉంచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి గ్రామంలో ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. ఏ ఉచిత ఆరోగ్య శిబిరాలలో పశువులకు వచ్చే వ్యాధులు, నివారణ మార్గాలపై పశు వైద్య సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. పశుగణాభివృద్ధి తో వ్యవసాయం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. దాంతో రైతులు ఆర్థికంగా నిలదొక్కుకొని కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుచుకోవచ్చునన్నారు. అనంతరం పశు వైద్య సిబ్బంది పలు పశు



పశు ఆరోగ్య శిబిరం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గ్రామ సర్పంచ్ రామ్మోహన్ చౌదరి ఇతర నాయకులు, రైతులు

వులకు వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ప్రభుత్వ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామ్మోహన్ చౌదరి, వెంకటస్వామి, వెంకటసుబ్బయ్య, పశు వైద్య సిబ్బంది ఎర్రి స్వామి, సుధాకర్ నాయక్,విజయ్ కుమార్, మారుతి, రవికుమార్,అనిల్ కుమార్,రైతులు పాల్గొన్నారు..

# శ్రీ మారెమ్మ, దేవమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

**బెళుగుప్ప (తెలుగోడు), జనవరి 20 :**
బెళుగుప్ప మండలం పరిధిలోని యర్రగుడి గ్రామంలో గత డిసెంబర్ నెల 24 వ తేదీన శ్రీ మారెమ్మ, దేవమ్మ అమ్మవార్ల ఊరు దేవర జాతర ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం శ్రీ మారెమ్మ దేవమ్మ ఆలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నెల పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లకు వివాహ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో శ్రీ మారెమ్మ దేవమ్మ ఊరు దేవర జాతర జరిగి 30 రోజులు కావడంతో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నెలపూజను నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలను శాలువాతో పూలమాలలు వేసి సత్కరించారు.







గ్రామ పెద్దలను శాలువాతో సన్మానిస్తున్న గ్రామస్తులు. తీర్థప్రసాదాలను ప్రజలకు అందజేస్తున్న దృశ్యం



రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో అమర్నాథరెడ్డి

# ఇడమడకలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం

**ఏవో అమర్నాథ్ రెడ్డి ..**

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 20 :**
రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ (పంట నమోదు) చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమర్నాథరెడ్డి సూచించారు. మంగళవారం ఇడమడక గ్రామంలో నిర్వహించిన ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు సాగుపై కీలక సూచనలు చేశారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు పంటను అమ్ముకునే వీలుంటుందని స్పష్టం చేశారు. రైతులందరూ సకాలంలో ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం రైతులు పంటలపై అధిక మోతాదులో యూరియా వినియోగిస్తున్నారని, దీనివల్ల పంటలకు చీడపీడలు, తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని ఆయన తెలిపారు . కేవలం నత్రజని ఎరువులపైనే కాకుండా, ఎరువుల సమతుల్యం పాటించాలని సూచించారు. పొటాష్ వాడకం వల్ల పంటకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. గింజ గట్టిపడి, పంట నాణ్యతతో పాటు అధిక దిగుబడి వస్తుందని వివరించారు. భాస్వరం, పొటాష్ ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులోనే వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు మమత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



మోహన్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న నేతలు

# మోహన్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**గూడూరు (తెలుగోడు), జనవరి 20 :**
గూడూరు మండలం పోటుపాలెం గ్రామానికి చెందిన గుంటపూడి మోహన్ కుటుంబానికి శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ అందించిన 3000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని నాయకులు వాటంబేటీ హరికుమార్, నరేష్, మధు స్థానిక నాయకులు అందించారు.



పోలయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న నేతలు

# పోలయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం

**గూడూరు (తెలుగోడు), జనవరి 20 :**
గూడూరు మండలం పోటుపాలెం గ్రామానికి చెందిన కవరగిరి పోలయ్య కుటుంబానికి శాసన సభ్యులు పాశిం సునీల్ కుమార్ అందించిన 3000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని నాయకులు వాటంబేటీ హరికుమార్, నరేష్, మధు స్థానిక నాయకులు అందించారు.


# బెళుగుప్పలో శ్రీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

**ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహించిన ఆర్యవైశ్యులు**

**బెళుగుప్ప (తెలుగోడు), జనవరి 20 :**
బెళుగుప్పలో వెలసిన ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. మంగళవారం ఉదయమే ఆర్యవైశ్య కుల బాంధవులు అమ్మవారి ఆలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో అమ్మవారి విగ్రహానికి ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామ పారాయణం,ప్రత్యేక పూజలు, ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులతోపాటు , ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



హోమాల్లో పాల్గొన్న ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం. అమ్మవారి ఉత్సవమూర్తి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్

# ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలి

**జిల్లా అభివృద్ధికి శాఖల సమన్వయం అనివార్యం..**
**జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్..**

**పుట్టపర్తి (తెలుగోడు), జనవరి 20 :**
ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు వేగంగా, నాణ్యమైన పరిష్కారం అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, జిల్లా అభివృద్ధి లక్ష్యాల సాధనకు అన్ని ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం పుట్టపర్తి కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్?డబ్ల్యూఎస్ డీఈఈలు, ఏఈఈలు, డీడబ్ల్యూఎంఏ ఏపీడీలు, ఏపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలకు సంబంధించి పీజీఆర్?ఎస్?లో నమోదైన దరఖాస్తులు ఒక్కటైనా పెండింగ్ లేకుండా గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు పెట్టే ప్రతి అర్జీకి బాధ్యతతో స్పందిస్తూ, వారి నమ్మకాన్ని నిలబెట్టేలా పని చేయాలని సూచించారు. జిల్లాకు సంబంధించి వెలువడుతున్న ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి, వాస్తవాలను స్పష్టంగా ప్రజలకు తెలియజేయడం ద్వారా సానుకూల ప్రజాభిప్రాయాన్ని పెంపొందించాలన్నారు. అధికారుల సామర్థ్యాభివృద్ధికి ఐ-గాట్ కర్మయోగి ప్లాట్‌ఫాం ద్వారా శిక్షణ కోర్సులను తప్పనిసరిగా పూర్తి చేయాలని తెలిపారు. పంచాయతీ, డీడబ్ల్యూఎంఏ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఆధ్వర్యంలో జనవరి 24న నిర్వహించనున్న స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా పటిష్టంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో అమలయ్యే మన పల్లె – మన నీరు, జల్ సంచయ్ జన భాగిదారి 2.0 కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామాల్లో నిర్మించిన కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సులు పూర్తిస్థాయిలో వినియోగంలో ఉండేలా పర్యవేక్షణ పెంచాలని, జల్ జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందేలా పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
రెవెన్యూ శాఖ ద్వారా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్స్ కార్యక్రమంపై సమీక్ష చేస్తూ, ఎన్ని దరఖాస్తులు స్వీకరించారో, ఎన్ని పరిష్కరించారో వివరాలను మండల, డివిజన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించి ప్రజల ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ, సవరణలు, డిజిటలైజేషన్ ప్రక్రియలో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ పరిధిలో బయోమెట్రిక్ హాజరు ఇన్-అవుట్‌ను కచ్చితంగా అమలు చేయాలని, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (ఎఫ్‌బీఎంఎస్)ను మార్గదర్శకాల ప్రకారం ఖచ్చితంగా నిర్వహించాలని తెలిపారు. అలాగే పౌరుల ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేసి అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని, కౌశలం వర్క్ ఫ్రమ్ హోమ్ బ్యాలెన్స్ సర్వేను సమయపాలనతో పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు జిల్లాలో సమర్థవంతంగా అమలయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, డీఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఆర్?డబ్ల్యూఎస్ డీఈఈలు, ఏఈఈలు, డీడబ్ల్యూఎంఏ ఏపీడీలు, ఏపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీలో 'నబిన్' యుగం ప్రారంభం

**జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు**
**జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు సోమల ప్రకాష్‌నాయుడు..**

**(తెలుగోడు), జనవరి 20 :**



బిజెపి జాతీయ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్‌కి సత్యసాయి జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్ నాయుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీలో ఇక నుంచి 'నబిన్' యుగం ప్రారంభమైందని వ్యాఖ్యానించారు. నితిన్ నబీన్ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా మరింత బలోపేతం అవుతుందని, ప్రతి రాష్ట్రంలో పార్టీని పటిష్టంగా నిలబెట్టి కార్యకర్తలకు అండగా నిలుస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీని రాజ్యాధికారంలోకి తీసుకువచ్చే దిశగా ఆయన సమర్థ నాయకత్వం కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. ప్రతి రాష్ట్రంలో కమలం గుర్తు మరింతగా విరబూసేలా నితిన్ నబీన్ పనిచేస్తారని, ఆయన వ్యూహాత్మక నిర్ణయాలు బీజేపీ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయని అన్నారు. ఆయన నాయకత్వంలో దేశమంతా కాషాయం మహిమతో మరింత ఉజ్వలంగా వెలుగొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పసుపులేటి వెంకటేష్, జనగాం నాగభూషణ్, నారాయణ, జాస్తి అశోక్ కుమార్, పీవీ శివకుమార్, ఆరువేటి గంగులప్ప, సంజీవరెడ్డి తదితరులు పాల్గొని నితిన్ నబీన్‌కు శుభాకాంక్షల వర్షం కురిపించారు. దేశ రాజకీయాల్లో బీజేపీ మరింత శక్తివంతమైన పాత్ర పోషించబోతున్న తరుణంలో, నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్?కు దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయని సోమల ప్రకాష్ తెలిపారు.



గ్రామ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాస్ రెడ్డి

# గ్రామ స్థాయిలో వైఎస్సార్సీపీ బలోపేతానికి గ్రామ కమిటీలు కీలకం

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 20 :**
వైయస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలనను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా గ్రామ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎసచవతీతీచర్సిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామి రెడ్డి పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మంగళవారం లింగారెడ్డిపల్లి గ్రామంలో వైఎస్సార్ గ్రామ కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి ఆదేశాల మేరకు, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి గారి సూచనలతో ఈ గ్రామ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని, ఆ సంక్షేమ పాలనను మళ్లీ ప్రజలకు అందించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని అన్నారు. గ్రామ కమిటీల ద్వారానే పార్టీని బలపరిచి, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో పార్టీ కార్యక్రమాలు మరింత ఉత్సాహంగా నిర్వహిస్తూ, కార్యకర్తలు ప్రజల మధ్య ఉండి పనిచేయాలని సూచించారు. గ్రామ కమిటీల సమిష్టి కృషితోనే వైఎస్సార్సీపీని తిరిగి అధికారంలోకి తీసుకురాగలమని, రానున్నది మన ప్రభుత్వమేనన్న నమ్మకంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంజీవపురం గ్రామపంచాయతీ అబ్జర్వర్ వీరనారప్ప, సంజీవ్, రాంభూపాల్ రెడ్డి, జెసిబి నారాయణస్వామి, గుర్రం నరసింహారెడ్డి తదితరులు వైఎసచవతీతీచర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వేటు తప్పదు

**అవినీతికి చోటు ఉండకూడదు ..**
**శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం..**
**పోలీస్ శాఖ ప్రతిష్ట పెరిగేలా పని చేయాలి..**
**జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్..**



తనకల్లు పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

**తలుపుల/ఎన్.పి.కుంట/తనకల్లు (తెలుగోడు), జనవరి 20 :**
కదిరి సబ్ డివిజన్ పరిధిలోని తలుపుల, ఎన్.పి.కుంట, తనకల్లు పోలీస్ స్టేషన్లను శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ల పనితీరు, కేసుల పురోగతి, దర్యాప్తు విధానాలపై సమగ్రంగా సమీక్షించారు. తనిఖీ సందర్భంగా స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రిజిస్టర్లు, కేసు రికార్డులు, పెండింగ్?లో ఉన్న కేసుల స్థితి, దర్యాప్తు పురోగతిని ఎస్పీ పరిశీలించారు. సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకొని, ఆయా మండలాల్లో నేరాల పరిస్థితిని సమీక్షించారు. ప్రతి కేసును చట్టబద్ధంగా, సాక్ష్యాధారాల ఆధారంగా దర్యాప్తు చేయాలని స్పష్టం చేశారు. ఆలస్యం లేకుండా విచారణ పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఫిర్యాదులను సీరియస్?గా తీసుకొని చిన్న విషయాన్ని కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. రాత్రి వేళల్లో గస్తీలు పెంచి చోరీలను నివారించాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. గ్రామసభల ద్వారా మహిళా నేరాలు, సైబర్ మోసాలు, శక్తి యాప్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.
పేకాట, మట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవినీతికి ఎట్టి పరిస్థితుల్లోనూ తావు ఇవ్వబోమని, విధుల పట్ల నిబద్ధతతో పనిచేయాలని హెచ్చరించారు. ఎవరి నిర్లక్ష్యం వల్ల ప్రజలకు ఇబ్బంది కలిగినా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్టేషన్ పరిధిలో చట్టం, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలతో సమన్వయం కీలకమని పేర్కొంటూ "ప్రజల విశ్వాసమే పోలీసులకు నిజమైన బలం" అని ఎస్పీ అన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ప్రాంగణం, లాకప్ గది, కంప్యూటర్ రూమ్, వాహన పార్కింగ్ స్థలం, పట్టుబడిన ద్విచక్ర వాహనాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై విధి నిర్వాహణలో క్రమశిక్షణ, నిబద్ధత ప్రాముఖ్యతపై దృష్టి సారించారు. సిబ్బంది సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ తనిఖీలో కదిరి డీఎస్పీ శివన్నారాయణ స్వామి, సీఐ నాగేంద్ర, ఎస్సైలు చెన్నయ్య, సుమతి, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.



కదిరి డీఎస్పీతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్

# జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి శారదమ్మకు ఘన సన్మానం

**ముదిగుబ్బ/ధర్మవరం (తెలుగోడు), జనవరి 20 :**
భారతీయ జనతా పార్టీ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా ధర్మవరానికి చెందిన శారదమ్మను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ధర్మవరం బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్టీ బీజేపీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ నాయక్ హాజరయ్యారు. అనంతరం భాస్కర్ నాయక్‌తో పాటు ధర్మవరం బీజేపీ అధ్యక్షుడు జింక చంద్రశేఖర్, సాకే ఓబులేసు, బీజేపీ మహిళా నాయకురాలు బిరే విజయలక్ష్మి కలిసి నూతనంగా నియమితులైన బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శారదమ్మకు పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయక్ మాట్లాడుతూ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శిగా శారదమ్మ ఎన్నిక కావడం ఎంతో ఆనందకరమని పేర్కొన్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ, అంచెలంచెలుగా ఎదిగి భవిష్యత్తులో మరిన్ని బాధ్యతలు చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.



శారదమ్మను అభినందిస్తున్న జింక చలపతి

మహిళల శక్తిని బీజేపీ మరింత బలోపేతం చేయడంలో శారదమ్మ కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ధర్మవరం బీజేపీ అధ్యక్షుడు జింక చంద్రశేఖర్ మాట్లాడుతూ పట్టణంలోని 25వ వార్డులో శారదమ్మ ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకొని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసిన తీరు ప్రశంసనీయమన్నారు. ప్రజలతో నిత్యం మమేకమై పనిచేసే నాయకురాలిగా ఆమె గుర్తింపు పొందిందని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి శారదమ్మ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించినందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, మంత్రి కార్యాలయం ఇన్?చార్జ్ హరీష్ బాబు కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం, మహిళల సాధికారత కోసం తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా మోర్చా సభ్యులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని శారదమ్మకు శుభాకాంక్షలు తెలియజేశారు.



శారదమ్మను అభినందిస్తున్న భాస్కర్ నాయక్

# ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం

**అగళి (తెలుగోడు), జనవరి 20 :**
వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో మంగళవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అగళి గ్రామంలోని ఆర్యవైశ్యులు అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం విశేషంగా చెరకు హారతి ఇచ్చారు అనంతరం ప్రత్యేక పూలతో అలంకరించారు. 102 గోత్రాలు 102 కేజీలు పుష్పయాగాలు, కుంకుమార్చన, లలితాసహస్ర నామ పారాయణం పఠించి మహామంగళహారతి ఇచ్చారు. గ్రామంలోని ఆర్యవైశ్యులు, వేలాది మంది భక్తులు పాల్గొని వాసవి అమ్మవారిని దర్శించుకున్నారు.



అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు. పూజకు ఉపయోగించిన 102 రకాల పుష్పాలు



ప్రత్యేక అలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు
ప్రత్యేకపూజలో పాల్గొన్న మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శివరాములు దంపతులు

# వాసవీ మాత త్యాగం యావత్ సమాజానికి ఆదర్శం

**ఆత్మార్పణ దినోత్సవ వేడుకల్లో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి..**

**పుట్టపర్తి (తెలుగోడు), జనవరి 20 :**
త్యాగానికి ప్రతీకగా నిలిచిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి త్యాగం యావత్ సమాజానికి ఆదర్శమని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తచెరువు, బుక్కపట్నం, పుట్టపర్తి పట్టణాల్లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు విచ్చేసిన మాజీ మంత్రికి ఆర్యవైశ్యులు ఘన స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. వాసవీ మాత చేసిన మహోన్నత త్యాగం తరతరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ కుమార్, నాయకులు కోటా సత్యం, వెంకట నారాయణ, పార్థ, విశ్వనాథ్, మల్లికార్జున, మహేష్, ప్రకాష్ రాజా, వి.ఎల్.ఎన్. మూర్తి, గుప్తా, నాగార్జునలతో పాటు కూటమి పార్టీల నాయకులు సామకోటీ ఆదినారాయణ, చెన్నకేశవ గంగాధర్, ఎర్రకేశవ మంజు, సాయి మారుతి శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి పల్లె, కోటా సత్యంని సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు



వాసవీ మాత ఆలయానికి వెళుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి



డ్రోన్‌తో పర్యవేక్షిస్తున్న దృశ్యం

# మారమ్మ జాతరలో డ్రోన్‌తో ప్రత్యేక నిఘా

**శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం..**

**బుక్కపట్నం (తెలుగోడు), జనవరి 20 :**
బుక్కపట్నం మండలంలోని నారసింపల్లి, నారసింపల్లి తాండ గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన మారమ్మ జాతరకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. జాతర ప్రాంగణం, పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు వంటి సున్నిత ప్రాంతాలపై డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. గుంపుల నియంత్రణ, ట్రాఫిక్ సజావుగా సాగడం, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలను తక్షణమే గుర్తించి చర్యలు తీసుకునే ఉద్దేశంతో ఈ ఆధునిక నిఘా వ్యవస్థను వినియోగించారు. పుట్టపర్తి రూరల్ సిఐ సురేష్ ఆధ్వర్యంలో ఎస్సైలు, సిబ్బందితో ప్రత్యేక పోలీస్ బందోబస్తును మోహరించారు. మహిళా పోలీస్ సిబ్బందిని కూడా విధుల్లో నియమించారు. ఈ సందర్భంగా సిఐ సురేష్ మాట్లాడుతూ, ప్రజలు భక్తిశ్రద్ధలతో జాతరను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ అన్ని విధాలా భద్రత కల్పిస్తోందని, ఏవైనా అనుమానాస్పద అంశాలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన డ్రోన్ నిఘా, భద్రతా ఏర్పాట్లకు ప్రజలు సహకరించి మారమ్మ జాతరను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



ఎస్సై ఇషాక్ బాషాను సన్మానిస్తున్న దృశ్యం

# బదిలీపై వెళ్తున్న ఎస్సై ఇసాక్ బాషాకు సన్మానం

**అమరాపురం (తెలుగోడు), జనవరి 20 :**
అమరాపురం ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళుతున్న ఎస్సై ఇసాక్ భాషా కు వి. అగ్రహారం పంచాయతీ కో కన్వీనర్ నవీన్ కుమార్ శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానం చేశారు. పంచాయతీ కో కన్వీనర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ మండలంలో ఎస్సైగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ తన వంతు కర్తవ్యాన్ని బాధ్యతగా నిర్వహించి ప్రజల మన్నలను పొందారని పేర్కొన్నారు.

# 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు విశాఖ ఉత్సవ్ నిర్వహణ

**విశాఖపట్నం , జనవరి 20 :**
జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు విశాఖ ఉత్సవ్ నిర్వహించాలని నిర్ణయించారు. విశాఖతో పాటు అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోనూ ఒకేసారి ఉత్సవాలు నిర్వహించేలా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. విశాఖలో ఉత్సవాల ప్రారంభ వేడుక, అనకాపల్లి జిల్లాలో ముగింపు వేడుక నిర్వహించాలని సమీక్షలో నిర్ణయం తీసుకున్నారు. విశాఖ ఉత్సవ్‌పై స్థానిక కలెక్టరేట్‌లో జరిగిన ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రులు కందుల దుర్గేష్, శ్రీమతి అనిత, శ్రీమతి సంధ్యారాణి, డోలా బాలవీరాంజనేయ స్వామి , కొల్లు రవీంద్ర, ఎంపీ శ్రీ భరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ , శ్రీ వెలగపూడి రామకృష్ణ , పంచకర్ల విష్ణు కుమార్ రాజు , కొణతాల రామకృష్ణ , సుందరపు విజయ్ కుమాం, బండారు సత్యనారాయణమూర్తి , వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఏపీటీడీసీ ఎండీ శ్రీమతి ఆమ్రపాలి కాట, విశాఖపట్నం కలెక్టర్ హరేందిర ప్రసాద్ , అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ , అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, విశాఖపట్నం సిపి శంకబ్రత బాగ్చి, అనకాపల్లి యస్ పి తుహిన్ సిన్హా , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అధిక చార్జీలు వసూలు చేసిన బస్సులపై 41 కేసులు నమోదు

*జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్..*

**మదనపల్లి (తెలుగోడు), జనవరి 20 :** అధిక చార్జీలు వసూలు చేసిన బస్సులపై 41 కేసులు నమోదు చేసినట్లుగా జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో 9 నుంచి 18 వరకు ప్రైవేటు బస్సులలో అధిక చార్జీల వసూలుపై ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించామని ఈ ప్రత్యేక డ్రైవ్‌ను అధికారులు సమర్థవంతంగా చేపట్టి, అధిక టికెట్ చార్జీలు వసూలు చేసిన బస్సులపై 41 కేసులు నమోదు చేసి రూ.4,10,000 జరిమానా విధించినట్లుగా పేర్కొన్నారు. అనుమతి లేకుండా నడపడం, పన్నులు చెల్లించకపోవడం, డాజ్లింగ్ లైట్లు వాడటం తదితర ఉల్లంఘనలపై మరో 15 కేసులు నమోదు చేసి రూ.32,350 జరిమానా విధించారని, ప్రయాణికుల నుంచి అందిన అధిక చార్జీల ఫిర్యాదులను సీరియస్?గా తీసుకొని, బస్సు యజమానులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించామని, అసాధారణంగా టికెట్ చార్జీలు వసూలు చేసిన ట్రావెల్స్?పై తనిఖీల సమయంలో చలాన్లు జారీ చేసినట్లుగా పేర్కొన్నారు.


ఈ చర్యల ద్వారా బస్సుల్లో టికెట్ చార్జీలు ప్రజలకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రయాణికుల భద్రతను కూడా రవాణా శాఖ అధికారులు బస్సుల యాజమాన్యం వారికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇకపై ఎవరైనా చట్ట విరుద్ధంగా అధిక టికెట్ చార్జీలు వసూలు చేస్తే, చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని రవాణా శాఖ అధికారి పేర్కొన్నారు.

# శ్రీ గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు 26 నుండి

**తిరుపతి, జనవరి 20:** తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో జనవరి 26 నుండి ఫిబ్రవరి 01వ తేదీ వరకు తెప్పోత్సవాలు జ?రుగ?నున్నాయి. ఏడు రోజుల పాటు సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు స్వామివారు దేవేరులతో కలిసి శ్రీ గోవిందరాజస్వామివారి పుష్కరిణిలో తెప్పల?పై విహరిస్తారు. ఆ తరువాత ఆలయ మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహిస్తారు. జనవరి 26న శ్రీ కోదండరామస్వామివారు, జనవరి 27న శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ పార్థసారథిస్వామి వారు, జనవరి 28న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారు, జనవరి 29న ఆండాళ్ అమ్మవారితో కలిసి శ్రీకృష్ణస్వామివారు, జనవరి 30, 31, ఫిబ్రవరి 01 తేదీల్లో అమ్మవార్లతో శ్రీ గోవిందరాజస్వామి వారు తెప్పలపై భక్తులకు కనువిందు చేయ?నున్నారు. చివ?రి రోజు తెప్పోత్స?వం అనంత?రం ఎదురు ఆంజనేయ స్వామివారి సన్నిధికి స్వామివారు వేంచేపు చేస్తారు.


# వెండితో వెడ్డింగ్ కార్డు ధర రూ. 25 లక్షలు

**జైపూర్, జనవరి 20:** రాజస్థాన్ జైపూర్‌లో ఓ తండ్రి తన కూతురి పెళ్లి కోసం ఏకంగా 3 కిలోల స్వచ్ఛమైన వెండితో వెడ్డింగ్ కార్డ్ చేయించారు. దీని ధర అక్షరాలా ?25 లక్షలు. శివ్ జోహ్రీ అనే వ్యక్తి ఏడాది పాటు కష్టపడి, ఒక్క మేకు కూడా వాడకుండా 128 వెండి ముక్కలతో ఈ అద్భుతాన్ని సృష్టించారు. ఇందులో మొత్తం 65 మంది దేవుళ్ల ప్రతిమలను చెక్కించారు. తన కూతురి పెళ్లికి బంధువులతో పాటు సకల దేవతలను ఆహ్వానించాలనే ఉద్దేశంతోనే ఇలా చేశారట.



# 9న మెడికల్ కౌన్సిల్ ఎన్నిక

**అమరావతి, జనవరి 20:** ఏపీ మెడికల్ కౌన్సిల్ ఎన్నిక ఫిబ్రవరి 9న జరగనుంది. నామినేషన్లు ఈనెల 27 వరకు స్వీకరిస్తారు. 55,504 మంది అర్హులైన వైద్యులు ఆన్లైన్, మొబైల్ ద్వారా ఓటు వేయొచ్చు. దీనికోసం?ఫ్రావీజ ఆన్లైన్ ఎలక్షన్ పోర్టల్లో లాగిన్ కావాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు తెలిపారు. 13 మంది సభ్యులను ఎన్నుకుంటారు.



# వాల్మీకిపురం రోడ్డు ప్రమాదం మృతుల ఆచూకీ లభ్యం

**మదనపల్లి (తెలుగోడు), జనవరి 20 :** అన్నమయ్య జిల్లా, పీలేరు నియోజకవర్గంలోని వాయల్పాడు మండలం, చింతరాపల్లి వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చనిపోయిన విషయం తెలిసిందే. వాల్మీకి పురం ఎసచవతీతీచ తిప్పేస్వామి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతులు అదే మండలంలోని జమ్మాలపల్లికి చెందిన రుద్రయ్య(44), చింతపర్తికి చెందిన రెడ్డిశేఖర్ (40)గా గుర్తించారు. చింతరాపల్లి నుంచి చింతపర్తికి బైకు మీద వెళ్తుండగా.. ఈ ఘటన జరిగిందనీ, కారు మదనపల్లె వాసులదని సమాచారం. కేసు దర్యాప్తులో ఉంది.

## రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు

# రూ.4 లక్షల ప్రమాద బీమా పరిహారం

### ప్రభుత్వం అండగా నిలుస్తోంది.. మాజీ మంత్రి పల్లె భరోసా..

**ముదిగుబ్బ/బుక్కపట్నం (తెలుగోడు), జనవరి 20 :** బుక్కపట్నం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన రైతులు వడ్డే శేషప్ప, కిష్టప్ప ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడం గ్రామాన్ని విషాదంలో ముంచింది. కుటుంబ పెద్దల ఆకస్మిక మరణంతో ఆ కుటుంబాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ప్రభుత్వం అండగా నిలిచింది. మంగళవారం కృష్ణాపురం పంచాయతీ పరిధిలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రమాద బీమా ఆర్థిక సహాయ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేశారు. మారాల సహకార సంఘం ద్వారా పంట రుణాలు పొందుతూ, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించిన నేపథ్యంలో కిసాన్ పథకం కింద ఈ పరిహారం మంజూరైనట్లు సహకార సంఘం డైరెక్టర్ ముద్దులూరు ఆంజనేయులు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రమాదంలో మృతి చెందిన రైతు కుంచెపు శేషప్ప కుమారుడు హరీష్‌కు రూ.2 లక్షలు, మరో రైతు కిష్టప్ప భార్య జయమ్మకు రూ.2 లక్షలు చొప్పున మొత్తం రూ.4 లక్షల ప్రమాద బీమా పరిహార చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ... రైతుల కష్టకాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతోనే ప్రమాద బాధిత రైతు కుటుంబాలకు తక్షణమే ఆర్థిక సహాయం



పాత్రికేయులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

అందించగలిగామని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు రైతు కుటుంబాలను తీవ్రంగా కలచివేస్తాయని, అలాంటి వేళ ప్రభుత్వం తోడుగా నిలవడం బాధ్యత అని ఆయన అన్నారు. పరిహారం అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు స్పందిస్తూ, తమ కష్ట సమయంలో వెంటనే స్పందించి ఆర్థిక సహాయం అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లెకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం మండల టీడీపీ నాయకులు, సింగిల్ విండో అధ్యక్షుడు అప్పస్వామి నాయుడు, సహకార సంఘం డైరెక్టర్ యాదాలంకపల్లి ముత్తులూరి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, గోపాలపురం గంగాధర్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





మృతిచెందిన రైతు కుమారుడికి చెక్కు అందిస్తున్న పల్లె. మృతి చెందిన రైతు కుటుంబాలను పరామర్శిస్తున్న దృశ్యం



# దళితులను కుల రాజకీయాలకు వాడుకోవడం వైసీపీకి తగదు

*మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్*

**విజయవాడ, జనవరి 20 :** పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలో రెండు ఎస్సీ వర్గాల మధ్య జరిగిన గొడవులను తమ స్వార్ధ ప్రయోజనాలకు వైసీపీ పార్టీ వాడుకోవడం తగదని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ లో ఉన్న ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో ఉన్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ కార్యాలయంలో మంగళవారం సంస్థ చైర్మన్ కేఎస్ జవహర్ ను కలిసి మెమోరాండం ఇచ్చారు. అనంతరం వివిధ అంశాలపై ఎస్సీ కమిషన్ చైర్మన్ తో మాజీ మంత్రి డొక్కా వరప్రసాద్ చర్చించారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ మాట్లాడుతూ పిన్నెల్లి గ్రామంలో శాంతి స్థాపనకు మాజీ మంత్రి మాణిక్య వర ప్రసాద్ కూడా కలిసి రావాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా పిన్నెల్లి గ్రామంలో రెండు ఎస్సీ కులాల మధ్య జరిగిన ఘర్షణలో మందా సాల్మన్ అనే వ్యక్తి చనిపోవడం దురదృష్టకరమన్నారు. దీన్ని రాజకీయానికి వైసీపీ పార్టీ వాడుకోవడం ఎస్సీలను సమాజానికి దూరం చేయడమేనన్నారు. ముఖ్యంగా ఇద్దరు ఎస్సీ కులాల మధ్య గొడవలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టమనడం వైసీపీ పార్టీ స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు పరాకాష్ట అని అన్నారు. మీ స్థాయిలో ఎస్సీలను రాజకీయాలకు వాడుకోవడం మానుకోవాలని వైసీపీ పార్టీకి హితవు పలికారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ కూడా ఈ విషయంలో పిన్నెల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో ఇరు వర్గాల ఘర్షణకు దారితీసిన పరిస్థితులు అంతేకాకుండా గ్రామంలో రెండు వర్గాలు శాంతియుతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మరణానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆ సంఘటనలో ముద్దాయి టీడీపీ పార్టీకి చెందిన వ్యక్తి అని తెలిపారు. ఈ ఘటనలో మరణించిన వ్యక్తి, నిందితుడు ఇద్దరూ కూడా దళిత వర్గానికి చెందినవారేనని, అయినప్పటికీ, వైసిపి పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని దళితులపై జరుగుతున్న దాడులుగా చిత్రీకరిస్తూ అబూత కల్పనలతో ప్రచారం చేస్తోందన్నారు. 2019 నుండి పల్నాడు ప్రాంతంలోని కొన్ని గ్రామాలలో వైసిపి అధికారంలో ఉన్నప్పుడు టిడిపి వర్గాలను, టిడిపి అధికారంలో ఉన్నప్పుడు వైసిపి వర్గాలను ఊళ్ల నుండి వెళ్లగొట్టేలా ఫ్యాక్షన్ మనస్తత్వాన్ని ఎస్సీలలో జొప్పించడం బాధాకరం అన్నారు. గత ఐదు సంవత్సరాలలో డ్రైవర్ సుబ్రహ్మణ్యంను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును కాపాడిన చరిత్ర వైసీపీదేనని అన్నారు.

# ప్రజలతో నేరుగా అనుసంధానం పజా వేదిక ద్వారా సాధ్యం

### మంత్రి అచ్చెన్నాయుడు..

**మంగళగిరి, జనవరి 20 :** మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్?లో నిర్వహించిన ప్రజా వేదిక కార్యక్రమంలో గౌరవ వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్యశాఖల శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి వ్యక్తిగత, సామాజిక, పరిపాలనా సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ప్రజా వేదికకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.



భూవివాదాలు, వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ, ఉపాధి, పింఛన్లు, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు వంటి అనేక అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రతి అర్జీని మంత్రిగారు శ్రద్ధగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని తెలుసుకుంటూ సంబంధిత అధికారులతో ఫోన్?లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ప్రజల సమస్యలను నేరుగా వినడమే ప్రజాస్వామ్య ప్రభుత్వాల ముఖ్య లక్ష్యం. ప్రజల వద్దకు వెళ్లి వారి ఇబ్బందులను తెలుసుకొని పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ విధానం అని అన్నారు. ప్రజలు భయపడకుండా, ఎలాంటి సంకోచం లేకుండా తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. సమర్పించిన అర్జీలన్నింటినీ సంబంధిత శాఖలకు పంపించి దశలవారీగా పరిష్కారం చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని, ప్రతి అర్జీకి న్యాయం జరిగేలా చర్యలు ఉంటాయని మంత్రిగారు భరోసా ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని స్పష్టం చేశారు. ప్రజా వేదిక కార్యక్రమం ద్వారా ప్రజలకు



ప్రభుత్వానికి మధ్య నేరుగా అనుసంధానం ఏర్పడిందని, ఇటువంటి కార్యక్రమాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజా వేదిక కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపడమే ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల ఆత్మగౌరవం గురించి మాట్లాడే నైతిక హక్కు జగన్, వైసీపీ నేతలకు ఉందా

### 210మంది దళితులను పొట్టనపెట్టుకున్న విషయాన్ని వైసీపీ నేతలు మరిచిపోయారా.. దళితుడిని చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుపై నేటికీ చర్యలు ఎందుకు తీసుకోలేదు.. వైసీపీ ఫేక్ ప్రచారాలపై ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఫైర్..


**రొళ్ల (తెలుగోడు), జనవరి 20 :** జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో 210మంది దళితులను పొట్టనపెట్టుకున్న నరరూప రాక్షసులు వైసీపీ నేతలు నేడు దళితుల గురించి, దళితుల ఆత్మగౌరవం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు శ్రీ సత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు అన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వివాదానికి రాజకీయ రంగు పులిమి, ఆ వివాదాన్ని ఎమ్మెల్యేకు ముడిపెట్టి నీచ రాజకీయాలకు పాల్పడడం వైసీపీ నేతల దిగజారుడు రాజకీయాలకు నిలువుటద్దం అని పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎం.ఎస్.రాజు మీడియాతో మాట్లాడుతూ జగన్ పాలనలో జరిగిన దళిత మారణకాండపై చర్చించే దమ్ము వైసీపీ నేతలకు ఉందా అని ప్రశ్నించారు. జగన్మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో దళితులను ఊచకోత కోసిన విషయాన్ని వైసీపీ నేతలు మరచిపోయినట్టు నటిస్తున్నారన్నారు. ఈ రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా దళితులు ఎవరూ ఆ అమానవీయ ఘటనలను నేటికీ మరచిపోలేద న్నారు. వైసీపీ పాలనలో దళిత మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, దుర్మార్గాలపై చర్చించే దమ్ము వైసీపీ నేతలకు ఉందా అన్నారు. చర్చించడానికి నేను రెడీగా ఉన్నాను అన్నారు. దళితుల ఆత్మగౌరవం గురించి మాట్లాడే వైసీపీ నేతలకు అసలు మనస్సాక్షి అనేది ఏమైనా ఉందా అన్నారు. దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దారుణంగా హత్య చేసి, శవాన్ని డోర్ డెలివరీ చేసి, ఈ విషయాన్ని ఎవరికీ చెప్పవద్దని బాధిత కుటుంబాన్ని బెదిరిస్తే తనపై జగన్మోహన్ రెడ్డి, వైసీపీ పార్టీ నేటికీ ఎలాంటి చర్యలు ఎందుకు తీసుకోలేదు అన్నారు. దళిత డాక్టర్ సుధాకర్ మాస్కు అడిగినందుకు పిచ్చివాడిని చేసి, నడిరోడ్డుపై చొక్కా తీసి, చేతులు వెనక్కి కట్టి ఈడ్చుకెళ్లి, తన మరణానికి కారణమైంది జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నేతల దుర్మార్గం కాదా అన్నారు.

చేతిలో అధికారం ఉందని జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో విశృంఖలంగా వ్యవహరించాడు అన్నారు. పులివెందులలో దళిత మహిళ నాగమ్మపై హత్యాచారం జరిగితే, ఆ కుటుంబానికి జరిగిన అన్యాయంపై పోరాడిన దళిత నాయకులమైన మాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టిన దుర్మార్గుడు జగన్మోహన్ రెడ్డి. కూటమి పాలనలో ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణలో ఒక వ్యక్తి చనిపోతే దానిని ప్రభుత్వ హత్య అని, ప్రభుత్వంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలని జూపూడి ప్రభాకర్ లాంటి సెల్ఫ్ డిక్లేర్డ్ మేధావి మాట్లాడడం చాలా హాస్యాస్పదం అన్నారు. పులివెందులలో నాగమ్మ హత్యకు సంబంధించి జగన్మోహన్ రెడ్డిపై కేసుపెడదామా? డాక్టర్ సుధాకర్ మరణానికి కారణం అప్పటి ప్రభుత్వమే, దానికి కూడా జగన్ పై కేసుపెడదామా అన్నారు. డాక్టర్ అచ్చెన్న మరణానికి కారణం వైసీపీ ప్రభుత్వమే జగన్ పై కేసుపెడదామా జూపూడి, రేపల్లె రైల్వే స్టేషన్‌లో ఒక దళిత గర్భిణిపై తన భర్త, పిల్లల ఎదుట అత్యాచారం జరిగిన ఘటనపై ఎవరిపై కేసు పెట్టాలి అన్నారు. దళితులపై అడుగడుగునా దాడులు, అవమానకర ఘటనలు, హత్యలు, అత్యాచారాలు జరిగితే ఆ ఐదేళ్లు ఏ కలుగులో దాక్కున్నావ్ జూపూడి ప్రభాకర్ అన్నారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో దళిత నరమేధం జరిగింది. కానీ ఏ ఒక్క ఘటనపైనా జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా, మరియు అప్పటి హోం మంత్రులు ఎవరూ నోరు మెదపలేదు. ఏ ఒక్క బాధిత కుటుంబానికి న్యాయం చేయలేదు. అన్యాయం చేసిన ఎమ్మెల్సీ అనంతబాబులాంటి దుర్మార్గులను జగన్మోహన్ రెడ్డి తన ప్రక్కన కూర్చోబెట్టుకుని భోజనం వడ్డించడం దళితుల పట్ల తనకున్న చిన్నచూపుకు నిదర్శనం. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఎక్కడ ఏ ఘటన జరిగినా వెంటనే స్పందిస్తున్నారు. ఘటనపై ఆరా తీసి, బాధిత కుటుంబాలకు అండగా నిలబడుతున్నారు. నేరస్తులకు తగిన శిక్షలు పడేలా చేస్తున్నారు. దళితుల పట్ల మా ప్రభుత్వానికి, మా నాయకులకు ఉన్న చిత్తశుద్ధికి ఇది నిలువెత్తు నిదర్శనం. వైసీపీ నేతలు ఎవరికీ దళితుల ఆత్మగౌరవం గురించి మాట్లాడే హక్కు లేదు అన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నేతలు ఓర్వలేక ప్రభుత్వంపై బురదజిమ్మాలని విష ప్రచారంతో ప్రజలను పక్కదారి పట్టించాలని ప్రయత్నాలు చేస్తున్నారు అన్నారు. జీడీ నెల్లూరులో అంబేద్కర్ విగ్రహానికి వైసీపీ నేతలే నిప్పుపెట్టి, ఏమీ తెలియనట్టు వాళ్లే ధర్నాలు చేసి హడావుడి చేశారు అన్నారు. టెక్నాలజీ ద్వారా కుట్రను మేం బయటపెడితే ఒక్క వైసీపీ నేత కూడా నెరు మెదపలేదు అన్నారు. అదేవిధంగా తిరుమల కొండపై మద్యం బాటిళ్లు తీసుకెళ్లింది వైసీపీ నేతలే అన్నారు. ఆ ఫోటోలను సాక్షి ఫోటోగ్రాఫర్ తీసి ప్రభుత్వంపై బురదజిమ్మడం కోసం ప్రయత్నం చేశారు అన్నారు. ఈ కుట్రను కూడా మా ప్రభుత్వం టెక్నాలజీతో ఛేదించి నిందితులపై తగిన చర్యలు తీసుకుంది. ఈ ఘటన గురించి కూడా వైసీపీ నేతలు మాట్లాడడం లేదు. ప్రజాదరణ పొందుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విషం నింపాలని జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అబద్దాలు చెప్పడం, కుట్రలు చేయడం, ప్రజలను పక్కదారి పట్టించాలనే ప్రయత్నాలు చేయడం మొత్తం వైసీపీలోనే ఉంది అన్నారు.

దళితులకు ఏదో అన్యాయం జరిగిపోయిందంటూ లేళ్ల అప్పిరెడ్డి లాంటి రౌడీ షీటర్లను వేసుకుని వైసీపీ నేతలు డీజీపీ అపాయింట్మెంట్ కోరడం నిజంగా ఆశ్చర్యంగా ఉంది అన్నారు. రౌడీషీటర్లకు డీజీపీ అపాయింట్మెంట్ ఎందుకో ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం జగన్మోహన్ రెడ్డిపై ఉంది. లేని



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు

సమస్యను ఉన్నట్లుగా చూపించడం కోసం వైసీపీ నేతలు ప్రయత్నాలు చేసి ఎక్కడికక్కడ దొరికిపోతున్నారు అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దళితులకు అన్యాయం జరుగుతుంటే వైసీపీ దళిత నేతలు మొండితోక అరుణ్ కుమార్, జూపూడి ప్రభాకర్, మేరుగ నాగార్జున, కైలే అనిల్ కుమార్, సుధాకర్ లాంటి వాళ్లు ఏ ఒక్కరూ నోరు ఎందుకు మెదపలేదో ప్రజలకు సమాధానం చెప్పగలరా అన్నారు.

జగన్మోహన్ రెడ్డికి ఈడీ పేరు చెబితే వెన్నులో వణుకు పుడుతోంది అన్నారు. ఈడీ అధికారులు తన దగ్గరకు ఏ క్షణమైనా రావొచ్చు అని భయంతో కాలం వెళ్లబుచ్చుతున్నాడు. అందుకే తన పార్టీ నేతలను హడావుడిగా పిలిచి ప్రజలను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలు చేయాలని జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు ఇచ్చాడు. దీంతో వైసీపీ నేతలు డీజీపీ ఆఫీసు దగ్గర హడావుడి చేసి, దళితుల కోసం వైసీపీ నిలబడుతుందనే ఒక అబద్దాన్ని ప్రజలకు నూరిపోయాలని ప్రయత్నాలు చేశారు. కానీ వీటిని ప్రజలు ఎవరూ నమ్మడానికి సిద్ధంగా లేరు. తప్పు చేసిన వాళ్ల దగ్గరకు చట్టం ఏదో ఒకరోజు వచ్చి తీరుతుంది...అడుగు ఆలస్యమవుతుందేమో కానీ...రావడం మాత్రం పక్కా. జగన్మోహన్ రెడ్డి జైలుకెళ్లడం ఖాయం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళితులు ఎవరూ వైసీపీ అబద్దాలను నమ్మవద్దు...వాళ్ల చేతుల్లో బలికావొద్దు. కూటమి పాలనలో దళితుల హక్కులు, చట్టాలు, ఆత్మగౌరవం అన్నీ పరిరక్షించబడుతున్నాయి. దళితుల సంతోషంగా ఉన్నారు అని ఎం.ఎస్.రాజు అన్నారు.



పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు నాయకులు రైతులు



శ్రీ వాసవిమాతకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు హరీష్ భట్టాచార్యులు, ఆర్యవైశ్య మహిళలు కుటుంబ సభ్యులు . హోమం నిర్వహిస్తున్న అర్చకులు హరీష్ భట్టాచార్యులు, నరేష్

# మధూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**పంట నమోదు, ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన..**
**పాడిపంటల మాస పత్రిక గురించి అవగాహన..**

**అగళి (తెలుగోడు), జనవరి 20 :**

మదూడి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ రైతులకు ఈ రబీ సీజన్లో సాగు చేసే ముఖ్యమైన రాగి, వేరుశనగ,మొక్కజొన్న, ఉద్యాన పంటలు మల్బరి,ఇతర పంటలలో పాటించాల్సిన నూతన సాంకేతిక పద్ధతుల గురించి తెలియజేయడం జరిగింది,మరీ ముఖ్యంగా పంట నమోదు గురించి తెలుపుతూ రైతులు పండించే పంటలను రైతు సేవా కేంద్ర సిబ్బంది ద్వారా నమోదు చేసుకోవాలని ఇది పంటల బీమా, నష్టపరిహారం,ఇతర ప్రయోజనాలు పొందడానికి సహాయపడుతుందని, యూరియా ను పంట దశ బట్టి అవసరమైనంత వరకు మాత్రమే దప, దపాలుగా వేయాలని అధికంగా వేయడం ద్వారా తెగుళ్లు, పురుగులు వచ్చి పెట్టుబడి పెరుగుతుందని యూరియాకు బదులుగా నానో యూరియా,నానో డిఏపి,సేంద్రియ ఎరువులు వాడాలని, రైతులు ఏపి ఎయిమ్స్ యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఈ యాప్ ద్వారా పంటల గురించి, పథకాల గురించి, వాతావరణం గురించి, మార్కెట్ ధరలు, వివిధ పంటలలో పాటించవలసిన నూతన యాజమాన్య పద్ధతులు గురించి తెలుసుకోవచ్చు అని,పాడిపంటలు మాస పత్రిక ద్వారా మనం వ్యవసాయానికి సంబంధించిన కొత్త విషయాలు తెలుసుకోవచ్చు. ఇది మన వ్యవసాయాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుందని కావున రైతు సోదరులు ఈ మాస పత్రిక సంవత్సరానికి 300 రూపాయలు చందా చెల్లించి రైతు సేవ కేంద్రాలలో నమోదు చేసుకోవాలని,

ఏపి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా రైతులు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందవచ్చుని ఇంకా మండలంలో చాలా మంది రిజిస్ట్రేషన్ చేసుకోలేదని భూమి ఉన్న ప్రతి ఒక రైతు కూడా రైతు సేవ కేంద్రంలో సంప్రదించి ఈ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఇది ఉంటేనే రాబోయే రోజులలో అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మరియు ఇతర పథకాలు పొందే అవకాశం ఉందని రైతులకు పూర్తిగా అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. రైతులు అందరూ కూడా ఈ అవకాశాలను ఉపయోగించుకోవాలని మండల కన్వీనర్ తిప్పేస్వామి,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కెంచు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,రైతులు, రైతు సేవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



మృతి చెందిన రైతు కుటుంబాలను పరామర్శిస్తున్న దృశ్యం

# అలజడులు సృష్టించేందుకు వైసీపీ నాయకుల కుట్ర

**రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మి నారాయణ ..**

**రొళ్ల (తెలుగోడు), జనవరి 20 :**

యన్ డి ఏ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరూ ఆనందోత్సహాల మధ్య జరుపుకుంటుంటే వైసీపీ నేతలు మాత్రం ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టి ప్రజలను భయభ్రాంతుల్ని చేసేందుకు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మి నారాయణ పేర్కొన్నారు. తుని నియోజకవర్గం కోటనందూరు మండలం అల్లీపూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, బీసీ నేత లాలం బంగారయ్యను వైసీపీ నేతలు అతి కిరాతకంగా హతమార్చారన్నారు. అధికారం కోల్పోయామని జీర్ణించుకోలేక అలజడులు సృష్టించే కుట్రలు చేస్తున్నారన్నారు. అది ఒక రాజకీయ పార్టీ అనేది మరచిపోయి పనికిమాలిన డైలాగ్స్ రప్పా రప్పా అంటూ పిలుపునిచ్చి, దాడులకు ప్రోత్సాహం ఇది జగన్ రెడ్డి పార్టీ నాయకుల కుట్ర అన్నారు. బడుగు, బలహీన వర్గాలపై వైసీపీ నేతలు దమనకాండకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైసీపీ నేతలకు బీసీలంటే గిట్టదు, అంచలంచెలుగా ఎదిగి గుర్తింపు తెచ్చుకుంటున్న బీసీ నేతలను అణచివేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైసీపీ నేతలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటోంది. తప్పు చేసిన వారిని ఎవరినీ వదలిపెట్టేదిలేదు, వైసీపీ హయాంలో జగన్ అండతో వైసీపీ నేతలు బీసీలపై దమనకాండకు పాల్పడ్డారన్నారు. ఇప్పుడు కూడా అదే ధోరణితో వ్యవహరిస్తున్నారు. వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజ్యాంగం ఇచ్చిన 34 శాతం శాతం రిజర్వేషన్లలో కోత పెట్టడం వల్ల 16,800 బీసీ ప్రతినిధులు రాజ్యాంగబద్ధమైన పదవులకు దూరమయ్యారని తెలిపారు.బీసీ సబ్ ప్లాన్ నిధులు రూ. లక్ష కోట్లు దారిమళ్లించారు, ఆదరణ రద్దు చేశారు, బీసీల ఆర్థికంగా నష్టం కలిగించారన్నారు. రాజకీయ ప్రాతినిధ్యాన్ని దెబ్బతీసి ఇప్పుడు బీసీలపై వేధింపులకు పాల్పడుతున్నారు. జగన్ రెడ్డి పాలనలో బీసీలకు జరిగింది అడుగడుగునా అవమానమే, జగన్ రెడ్డి సొంత జిల్లా ప్రొద్దుటూరులో చేనేత వర్గానికి చెందిన నందం సుబ్బయ్యను రోడ్డు మీదే అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అమర్ నాథ్ గౌడ్ ను నడిరోడ్డుపై పెట్రోల్ పోసి నిప్పంటించి చంపారన్నారు. జగన్ మోహన్ రెడ్డి కుల రాజకీయాలను బీసీ రాజకీయంగా నాశనం చెయ్యాలి అని పూనుకున్నాడని, ఇలాంటి కుట్రలు పన్ను తున్న వైసీపీ శాశ్వతంగా అధికారానికి దూరం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.

# ఆర్టీఐ కమీషనర్లతో ప్రమాణ స్వీకారం

**అమరావతి, జనవరి 20 :**

రాష్ట్ర సమాచార కమీషన్ కు నూతనంగా నియమితులైన కమీషనర్లచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రమాణ స్వీకారం చేయించారు.ఈమేరకు మంగళవారం ఎపి సచివాలయంలో నూతన కమీషనర్లతో ప్రమాణం చేయించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమీషన్ కు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ కమీషనర్ సహా ఇతర కమీషనర్లను నియమించడం జరిగింది.రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ వారి ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ నూతన కమీషనర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు.రాష్ట్ర సమాచార కమీషన్ చీఫ్ కమీషనర్ గా వజ్జా శ్రీనివాసరావుతో ముందుగా సిఎస్ విజయానంద్ ప్రమాణం చేయించారు.తదుపరి పరవాడ సింహాచలం నాయుడు,వంటేరు రవిబాబు,ఆదెన్న గాజుల,చరత్ చంద్ర కళ్యాణ చక్రవర్తి వట్టికూటిచే సమాచార కమీషనర్లుగా ప్రమాణం చేయించారు.ఈసందర్భంగా నూతన కమీషనర్లకు సిఎస్ పుష్పగుచ్ఛాలు అందించి రాష్ట్ర ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్,ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రామకృష్ణ,ఆర్టీఐ అధికారులు,నూతన ఆర్టీఐ కమీషనర్ల కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.



# వైభవంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ వేడుకలు

**అమ్మవారికి హోమం పూజలు..**
**అమ్మవారికి అభిషేకం..**
**వెండిరథంపై అమ్మవారి శోభాయాత్ర ..**

**అమరాపురం (తెలుగోడు), జనవరి 20 :**

మండల కేంద్రమైన అమరాపురం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు మంగళవారం శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలను ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయ అర్చకులు హరీష్ భట్టాచార్యులు ,నరేష్ భట్టాచార్యులు సుప్రభాత సేవ, గోపూజ మరియు అమ్మవారికి అభిషేకం, కోమాధి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. 108 కళాశాలతో అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా పూర్ణాహుతి బాల నగరులకు అగ్ర తాంబూల సమర్పణ కార్యక్రమాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం బాల నగరులచే బసవన్న దేవస్థానం నుండి పురవీధుల గుండా శోభాయాత్రలో మహిళలు నృత్య ప్రదర్శన, కోలాటశీ ప్రదర్శనలతో ఆలయ ప్రవేశం అనంతరం వాసవి అగ్నిగుండ ప్రజ్వలన కార్యక్రమం తో పాటు వాసవి మాత పురాణ ప్రవచనం తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలను విచ్చేసిన ఆర్యవైశ్య భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు మరియు ఆర్య వైశ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మాతలు అమ్మవారి మాల ధరించి విసర్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టు ప్రక్కల గ్రామాల నుండి ఇతర ప్రాంతాల నుండి ఆర్యవైశ్యులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వాసవి మాతకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు
వాసవి మాత పురాణ ప్రవచనం తెలియజేస్తున్న అర్చకులు హరీష్ భట్టాచార్యులు



వెండి రథంపై అమ్మవారి శోభాయాత్ర



శ్రీ వాసవి మాతకు పూజలు నిర్వహిస్తున్న మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రత్నశ్రీ చంద్రశేఖర్ గుప్తా . శ్రీ వాసవి మాత పూజలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు. జిల్లా ఉపాధ్యక్షుడు రత్నమ్మ

# పూలపల్లిలో ఘనంగా కొల్లాపురి మహాలక్ష్మి జ్యోతుల ఉత్సవాలు

**అగళి (తెలుగోడు), జనవరి 20 :**

మండల పరిధిలోని పూలపల్లి గ్రామంలో మంగళవారం కొల్లాపూరి మహాలక్ష్మి కి జ్యోతుల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా కొల్లాపురి మహాలక్ష్మి జాతర ఉత్సవాలకు సోమవారం సాయంత్రం రత్నగిరి నుంచి అమ్మవారిని వివిధ రకాల పూలు ఆభరణాలతో అంగరంగ వైభవంగా ప్రత్యేకంగా అలంకరించి మేళ తాళాలతో మంగళ వ్యాయిద్యాల నడుమ ఊరేగింపుగా పూలపల్లి గ్రామానికి తీసుకొచ్చారు. మంగళవారం గ్రామంలోని మహిళలు భక్తి శ్రద్దలతో బెల్లం బియ్యం పిండితో చేసిన చలివిడిని జ్యోతులుగా చేసుకొని మేళ తాళాలు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి అర్పించారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి గొడవ లు వాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై శోభారాణి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలో వచ్చిన భక్తులందరికీ విందు భోజనాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజషన్ సెక్రటరీ శ్రీనివాస్,ఎంపీపీ రేణుక కామరాజ్,సర్పంచ్ నరసింహామూర్తి, వైస్ ఎంపీపీ గాయత్రి హేమంతరాజు,జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు కె ఎన్ రమేష్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కేంచుయాదవ్, సీనియర్ టీడీపీ నాయకులు శ్రీనివాస్ ఆచార్,కృష్ణప్ప, మండలంలోని సర్పంచులు ఎంపిటీసీలు, పూలపల్లి గ్రామ ప్రజలు, ఇరుగుపొరుగు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు
హారతి జ్యోతులను తీసుకెళుతున్న మహిళలు



ప్రత్యేకంగా అలంకరించిన కొల్లాపురి మహాలక్ష్మీ అమ్మవారు.



# బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ తో 'రాగ వేదిక' భేటీ

**అమరావతి, జనవరి 20 :**

బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ తో ప్రముఖ సంగీత, సాంస్కృతిక సంస్థ రాగ వేదిక భేటీ అయింది. అమరావతిలో మంగళవారం రాగవేదిక వ్యవస్థాపకుడు రవికిరణ్, గారెత్ విన్ ఓవెన్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. భారతీయ సంగీతాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు తమ రాగవేదిక సంస్థ కృషి చేస్తోందని రవికిరణ్ బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ కు వివరించారు. రాగవేదిక డాట్ కామ్ ద్వారా భారతీయ కళలను, కళాకారులను ప్రోత్సహించడమే కాకుండా, బ్రిటన్ వంటి దేశాలలోని ఔత్సాహిక యువతీ, యువకులకు భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని ఆన్ లైన్ ద్వారా నేర్పిస్తున్నట్లు రవికిరణ్ వివరించారు. బ్రిటన్ లో రాగవేదిక ప్రాజెక్ట్ విస్తరణకు పరస్పర సహకారంతో పనిచేయడానికి బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ సుముఖత వ్యక్తం చేసినట్లు రవికిరణ్ వివరించారు.

# ప్రతి ఒక్కరు రహదారి భద్రత పాటించాలి

**స్కూలు పిల్లలు, ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం..**

**ఓడి చెరువు (తెలుగోడు), జనవరి 20 :**

రహదారి భద్రత మాసోత్సవాలు-2026లో భాగంగా మంగళవారం ఓడి చెరువులోని విజ్ఞాన్ సీబీఎస్?ఈ స్కూల్? ప్రాంగణంలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూలు విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కదిరి ఆర్టీవో శ్రీనివాసులు మాట్లాడుతూ రహదారి నియమాలు తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతకు భాగస్వాములు కావాలని సూచించారు. గుడ్ సమరిటన్ చట్టం ప్రాముఖ్యతను వివరించిన ఆయన, హిట్ అండ్ రన్ ప్రమాదాల్లో గాయపడిన వారికి లేదా మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం గురించి అవగాహన కల్పించారు. కదిరి మోటార్ వాహన తనిఖీ అధికారి వరప్రసాద్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు వాడాలని సూచించారు. సెల్?ఫోన్? మాట్లాడుతూ వాహనం నడపడం, మత్తు పానీయాలు సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. విద్యార్థులతో చర్చిస్తూ, రహదారి జాగ్రత్తలను కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేయాలని కోరారు.

అనంతరం ఓడి చెరువు ఎస్సై మల్లికార్జున రెడ్డి ఆటో డ్రైవర్లు, యజమానులను ఉద్దేశించి మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. అధిక ప్రయాణికులను ఎక్కించకుండా, రహదారి నియమాలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని అన్నారు. చివరగా అందరితో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ సీబీఎస్ఈ స్కూల్ చైర్మన్ మస్తాన్ వలి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



రహదారి భద్రతపై విద్యార్థులకు
అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఆటో డ్రైవర్లు, యజమానులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

# ఆటోను ఢీకొన్న లారీ నలుగురికి గాయాలు

**చిలకలూరిపేట, జనవరి 20 :**

మండల పరిధిలోని తాతపూడి హైవేపై మంగళవారం భారీ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన ఒక లారీ, ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. లారీ ఢీకొన్న వేగానికి ఆటో అదుపుతప్పి రహదారిపైనే పలు పల్టీలు కొట్టింది.ఈ ప్రమాద సమయంలో ఆటోలో ఉన్న నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన వెంటనే స్పందించి, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.ఆటో సత్తెనపల్లి నుంచి ముప్పవరం వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.

# కారు బైక్ ఢీ.. ఇద్దరు మృతి

**వాల్మీకి పురం, జనవరి 20 :**

అన్నమయ్య జిల్లాలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషాదకర ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు... మదనపల్లె- తిరుపతి కొత్త హైవే రోడ్డు, వాల్మీకి పురం సమీపంలోని చింతరాపల్లి వద్ద షిఫ్ట్ కారు పల్సర్ బైక్ ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడి కక్కడే దుర్మనం చెందారు. మృతులు ఎవరనేది ఇంకా తెలియ రాలేదన్నారు

# విజయ్ సేతుపతితో మణిరత్నం సినిమా

తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్ట్స్ సినిమాపై కోలీవుడ్ లో ఒక ఆసక్తికర చర్చ జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ సేతుపతి ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల శింబు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదట. దీంతో అదే కథకు విజయ్ సేతుపతిని హీరోగా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతికి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత విజయ్ సేతుపతి కెరీర్‌లో ఈ మణిరత్నం సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలా ఎ÷-లాన్ చేస్తున్నారట. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# శర్వానంద్‌కు కలసి వచ్చిన బాలయ్య సెంటిమెంట్



టాలీవుడ్‌లో కొన్ని చిత్రాలకు సంబంధించిన విశేషాలు భలే ఆసక్తికరంగా మారుతుంటాయి. అలాంటి సంఘటన ఒకటి హీరో శర్వానంద్ నటించిన నారి నారి నడుమ మురారి సినిమాకు జరిగింది. శర్వా హీరోగా రామ్ అబ్బరాజు డైరెక్షన్ లో అనిల్ సుంకర నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి సూపర్ హిట్ గా నిలిచింది. ఫెస్టివల్ సీజన్‌లో వచ్చిన చిత్రాల్లో చిన్న సినిమాగా వచ్చి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ బాక్సాఫీస్ వద్ద బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా మారింది. ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. దాదాపు 36 ఏళ్ల క్రితం నందమూరి బాలకృష్ణ హీరోగా, ఏ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో 'నారి నారి నడుమ మురారి' అనే సినిమా విడుదలై అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచింది. అందుకే అదే టైటిల్‌ను శర్వానంద్ సినిమా కోసం ఫిక్స్ చేయగానే, అది బాలకృష్ణ సినిమా టైటిల్ కదా అని ఆయన అనుమతి తీసుకోవాలని శర్వానంద్ స్వయంగా బాలకృష్ణకు ఫోన్ చేసి విషయం వివరించగా, ఈ విషయం నాకెందుకు చెప్తున్నావు, నిరభ్యంతరంగా టైటిల్ పెట్టుకో అంటూ బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అంతేకాదు, టైటిల్ పెట్టుకోమని చెప్పడమే కాకుండా సినిమా షూటింగ్‌కు, టైటిల్ రివీల్ కు ముహూర్తం కూడా బాలకృష్ణ ఫిక్స్ చేశారట. ఇక భారీ సినిమాల మధ్య పోటీగా రిలీజ్ అయినా నారి నారి నడుమ మురారి శర్వా కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచి ఇటు నిర్మాతలకు అటు డిస్ట్రిబ్యూటర్స్ కు భారీ లాభాలు తెచ్చిపెడుతోంది. ఈ విషయాన్నీ బాలయ్యకు చెప్పేందుకు శర్వానంద్ మరోసారి కాల్ చేయగా 'నా పేరు కాపాడావు? సినిమా సూపర్ హిట్ అయిందని తెలిసింది. ఇలానే రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలు చేయాలి' అంటూ శర్వానంద్‌ను దీవించారట బాలయ్య. ఆ సంతోషాన్ని తన ఫ్రెండ్స్ తో షేర్ చేసుకుంటూ ఇక నుంచి నా సినిమాలన్నింటికీ బాలయ్యతోనే ముహూర్తం పెట్టించుకుంటాను అని అన్నారట. మొత్తానికి, బాలయ్య టైటిల్ తో ఆయన పెట్టిన ముహూర్తంతో శర్వానంద్‌కు భారీ హిట్ అందుకున్నాడు.

# ఆలోచింప చేసే అద్భుత సినిమా



తెలుగులో ఇటీవలే ప్రేక్షకుల ముందుకు ప్రశంసలు అందుకున్న 'దండోరా' సినిమాపై అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ ప్రశంసల వర్షం కురిపించాడు . ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. 'ఇప్పుడే దండోరా సినిమా చూశాను. ఇది ఎంతో లోతైన, శక్తివంతమైన మరియు ఆలోచింపజేసే చిత్రం. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవిలు తమ నటనతో సినిమా ఆద్యంతం అద్భుతంగా రాణించారు. ఇంతటి బలమైన రచనతో, మన మూలాలకు దగ్గరగా ఉండే కథను ఎంతో చక్కగా తెరకెక్కించిన దర్శకుడు మురళీ కాంత్ గారికి నా హ్యాట్సాఫ్. ఇలాంటి గొప్ప ప్రయత్నాన్ని ప్రోత్సహించి, నిర్మించిన రవీంద్ర బెనర్జీ గారికి అభినందనలు. ఈ గొప్ప చిత్రంలో భాగమైన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అంటూ జూనియర్ ఎన్టీఆర్ రాసుకొచ్చాడు. అయితే ఎన్టీఆర్ లాంటి గ్లోబల్ స్టార్ నుంచి ప్రశంసలు అందడంతో చిత్ర యూనిట్ అమితానందంలో మునిగిపోయింది. 'ఎన్టీఆర్ అన్న నా పేరు పలికారు, ఇది నాకు చాలు' అంటూ దర్శకుడు మురళీ కాంత్ భావోద్వేగానికి లోనవ్వగా, నిర్మాత ఇది తమకు అసలైన విజయం అని సంతోషం వ్యక్తం చేశారు. గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. ఎన్టీఆర్ ప్రశంసలతో ఈ సినిమాకు ఒక్కసారిగా విపరీతమైన క్రేజ్ పెరగడమే కాకుండా, ప్రస్తుతం ఇండియాలో అమెజాన్ ప్రైమ్ టాప్-2లో ట్రెండింగ్‌లో నిలుస్తూ రికార్డు సృష్టిస్తోంది.

# మారుతి తదుపరి ప్రాజెక్ట్‌పై ఊహాగానాలు




టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో సక్సెస్‌ఫుల్ డైరెక్టర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మారుతి ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారారు, ప్రభాస్‌తో చేసిన ప్రతిష్టాత్మక చిత్రం 'రాజా సాబ్' అనంతరం ఆయన
తదుపరి ప్రాజెక్టుల గురించి సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు షికారు చేస్తున్నాయి. అయితే, ఈ వార్తలపై తాజాగా ఒక స్పష్టత వచ్చింది, నిజానికి గత కొన్ని రోజులుగా మారుతి ఒక మెగా హీరోతో సినిమా చేయబోతున్నారని, స్క్రిప్ట్ పనులు కూడా పూర్తయ్యాయని కొన్ని వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో వార్తలు హల్చల్ చేస్తున్నాయి. దీనికి తోడు కొన్ని నిర్మాణ సంస్థల పేర్లు, నిర్మాతల పేర్లు కూడా తెరపైకి వచ్చాయి, ఈ ప్రచారం కాస్తా వైరల్ కావడంతో అభిమానుల్లో అయోమయం నెలకొంది.
తాజా సమాచారం ప్రకారం, మారుతి తదుపరి సినిమా గురించి ప్రస్తుతం ప్రచారంలో ఉన్న వార్తలన్నీ కేవలం పుకార్లు మాత్రమే, అవి పూర్తిగా నిరాధారమైనవని, అందులో ఎటువంటి వాస్తవం లేదని ఆయన పీఆర్ టీమ్ ప్రకటించింది, కేవలం క్లిక్ బైట్స్ కోసం లేదా అంచనాల కోసం సృష్టించిన వార్తలుగా వీటిని పరిగణించాల్సి ఉంటుందని వారు పేర్కొన్నారు. మారుతి తన ప్రతి ప్రాజెక్టును చాలా ప్లాన్డ్‌గా అనౌన్స్ చేస్తుంటారు, ఒకవేళ తన తదుపరి సినిమా ఖరారైతే, ఆ వివరాలను ఆయన అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారా, సంబంధిత నిర్మాణ సంస్థల అధికారిక ప్రకటనల ద్వారా వెల్లడిస్తారు అని పేర్కొన్నారు. అనధికారిక మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని షేర్ చేయడం వల్ల అనవసరమైన గందరగోళం ఏర్పడే అవకాశం ఉందని మారుతి సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.

# బాబీ దర్శకత్వంలో చిరు తదుపరి సినిమా



ఓవైపు థియేటర్లలో 'మన శంకర వరప్రసాద్‌గారు' చిత్ర సందడి కొనసాగుతుండగా.. మరోవైపు చిరంజీవి తదుపరి చిత్ర పనులు చకచకా సాగిపోతున్నాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబు కానున్న ఈ సినిమా వచ్చే నెలలో లాంఛనంగా మొదలు కానుంది. మార్చి నుంచి చిరు రంగంలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పుడీ చిత్ర కథాంశానికి సంబంధించి మరో ఆసక్తికర విషయం బయటకొచ్చింది. ఇది కూతురి సెంటిమెంట్‌తో ముడిపడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని సమాచారం. దీంట్లో మలయాళ అగ్రహీరో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో అలరిస్తారని.. ఈ కథలో తన పాత్ర చాలా కీలకంగా ఉంటుందని తెలిసింది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు.

# దృశ్యం-3 కోసం వెంకటేశ్ బిజీ



కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం చిరంజీవితో కలిసి 'మన శంకరవర ప్రసాద్‌గారు' చిత్రంతో థియేటర్లలో నవ్వులు పంచుతున్న సంగతి తెలిసిందే. ఇక ఆయన సోలో హీరోగా చేస్తున్న సినిమా 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలో సందడి చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కానీ, దీని తర్వాత వెంకీ చేయనున్న సినిమా ఏదన్నది ఇంకా వెల్లడించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై నిర్మాత సురేశ్‌బాబు నుంచి స్పష్టత వచ్చింది. త్రివిక్రమ్ సినిమా పూర్తయిన వెంటనే వెంకటేశ్ 'దృశ్యం 3' కోసం రంగంలోకి దిగనున్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాని హిందీ 'దృశ్యం 3'తో పాటుగా అక్టోబరులో విడుదల చేసే అవకాశముందన్నారు. ఇక ఇప్పటికే 'దృశ్యం 3' మలయాళ వెర్షన్ చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. అది ఏప్రిల్‌లో విడుదల కానుంది.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD .. PRGI No- APTEL/25/A2739, Cell- 9963496956, 7382712780.